జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

bahujan bazaar
మీరు కోరుకున్న పుస్తకాలు /ప్రోడక్ట్స్ మీ ఇంటి వద్దకే చేర్చే ఆన్లైన్ షాపింగ్
To Order Visit : www.bahujanbazaar.in
CONTACT NO:7660027684

సంపుటి 7 సంచిక 208 | హైదరాబాద్, అక్టోబరు 09 సోమవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

## ఉప్పల్ కాంగ్రెస్..
# తిప్పలు వేరయా!

### నేటికీ ఖరారుకాని కాంగ్రెస్ అభ్యర్థి
### ఎవరికి వారే.. యమునా తీరే..
### జోరుగా గ్రూపు రాజకీయాలు
### అయోమయంలో కాంగ్రెస్ క్యాడర్



హైదరాబాద్: గ్రేటర్‌లోని ఉప్పల్ నియోజకవర్గంలో గులాబీ పార్టీ జెండా రెపరెపలాడుతుంటే.. కాంగ్రెస్ పార్టీ జెండా విలవిలాడుతోంది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రచారంలో దూసుకుపోతుంటే.. కాంగ్రెస్ పార్టీ నుంచి అభ్యర్థి పేరు ఇంకా ఖరారు కాలేదు. దీంతో అక్కడ ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా రాగిడి లక్ష్మారెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, సోమిరెడ్డి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరు ఎవరికి వారే తమ గాడ్ ఫాదర్‌ల ద్వారా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. కొంతమంది నేతలు టికెట్ కోసం ఢిల్లీకి సైతం వెళ్లి, తమ నేతలతో పైరవీలు చేస్తున్నారు. టికెట్‌పై ఎలాంటి సమాచారం లేకపోవడంతో ముగ్గురు అభ్యర్థులు ఎవరికి వారు తమ ఇష్టారాజ్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరిలో ఒకరికి మాత్రమే అసెంబ్లీ సీటు వచ్చే అవకాశం ఉంటుంది. మిగిలిన ఇద్దరు అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసే పరిస్థితులు ఉన్నాయని స్థానికులు విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉంటే మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పటికీ నియోజకవర్గాన్ని పట్టించుకోవడం లేదన్న ప్రచారం జోరుగా సాగుతుంది.

**గ్రూపులతో అయోమయం**

పార్టీ ప్రచారం, గ్యారెంటీ పథకాల ప్రచారంలో గ్రూపులుగా విడిపోయి ప్రచారాలు చేసుకుంటున్నారు. డివిజన్ల వారీగా గ్రూపులుగా వచ్చి ప్రచారాలు చేస్తుండటంతో కార్యకర్తలు, ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. టికెట్ ఆశిస్తున్న నేతలు తమ తమ అనుచర వర్గంతో గ్రూపు రాజకీయాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ క్యాడర్ వచ్చే ఎన్నికల్లో కలిసి మెలిసి పనిచేసే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి.

(మిగతా 2లో..)

# ఓట్లు మావే.. సీట్లు మావే..
## ముదిరాజు ఆత్మగౌరవ సభలో ఈటల కీలక వ్యాఖ్యలు




సికింద్రాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ముదిరాజ్ ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ముదిరాజులు తరలివచ్చారు. ఈ సభకు బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సహా కులానికి సంబంధించిన ముఖ్య నాయకులందరూ మీటింగ్‌కి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఈటెల రాజేందర్ పలు కీలక వ్యాఖ్యలకు చేశారు. జనాభా ప్రకారం ముదిరాజులకు 11 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలని అన్నారు. బీసీలకు 9 మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉంటే కేవలం మూడు పదవులు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో 11 శాతం ముదిరాజు సామాజిక వర్గం ఉంటే.. రాజకీయంగా ఏ పార్టీ కూడా ఆదరించలేదని అన్నారు. ముదిరాజులకు విద్య, ఉద్యోగ అవకాశాలు రావలంటే గతంలోనే బీసీ డీ నుంచి బీసీ ఏ కు వేయాలని ఆలోచన చేశామని పేర్కొన్నారు. మొట్టమొదటి సారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు శాసన సభలో ముదిరాజుల గురించి ప్రస్తావన తీసుకొచ్చానని ఈటల అన్నారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముదిరాజుల సమస్యలను అర్థం చేసుకొని వారి గురించి ఆలోచినస్తామని చెప్పినట్లు తెలిపారు. అలాగే 2008లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముదిరాజులను 'బీసీ డీ' నుంచి 'బీసీ ఏ'కు మార్చారని.. మైనార్టీలకు కూడా 4 శాతం రిజర్వేషన్ ఇచ్చారని పేర్కొన్నారు. అయితే ఇవి కేవలం ఒక్క ఏడాది మాత్రమే అమలయ్యాయని ఆ తర్వాత ఆగిపోయాయని తెలిపారు. అయితే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం.. వారి పక్షాన మైనార్టీ ఎమ్మెల్యేలు ఉండటంతో.. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషల్ అమలు చేయాలని సుప్రీంకోర్టుకు వెళ్లినట్లు పేర్కొన్నారు. కానీ ముదిరాజుల సమస్యను ఎవరూ కూడా పట్టించుకోలేదని.. ఇప్పటికీ ఆ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉందని చెప్పారు. తెలంగాణ వచ్చాకా సీఎం కేసీఆర్ కూడా ఆ సమస్యను పరిష్కరించ లేదని ఆరోపించారు. అలాగే దళిత ముఖ్యమంత్రి అని దళితులను మోసం చేశారని.. పదేళ్లుగా ఆదివాసీలకు ఒక్క మంత్రి పదవికూడా ఇవ్వలేదని అన్నారు. పథకాల కోసం అర్జీలతో సరిపెట్టుకోకుండా ఓట్లు మావే.. సీట్లు మావే అనే నినాదంతో పోరాడాలని ఈటల పిలుపునిచ్చారు.

### తెలంగాణలో ఇద్దరు ఐపీఎస్‌ల బదిలీ..




హైదరాబాద్, తెలంగాణలో ఇద్దరు ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. పోలీస్ అకాడమీ అడిషనల్ డైరెక్టర్ ఏఆర్ శ్రీనివాస్ నియామకమయ్యారు. అలాగే రాచకొండ జాయింట్ కమిషనర్ అడ్మిన్‌గా అంబర్ కిశోర్ ఝాను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఏఆర్ శ్రీనివాస్ ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. అంబర్ కిశోర్ హోంగార్డ్ అండ్ టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా పని చేస్తున్నారు. ఇద్దరిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

# నేడు హైదరాబాద్‌లో రాంజీగోండు
## రాంజీగోండు స్మారక ట్రైబల్ మ్యూజియంకు
## శంకుస్థాపన చేయనున్న కేంద్ర మంత్రులు




హైదరాబాద్, అక్టోబర్ 8: హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఆబిడ్స్ లో 0.75 ఎకరాల్లో రాంజీ గోండు స్మారక గిరిజన స్వాతంత్ర్య సమర యోధుల మ్యూజియంకు సోమవారం (అక్టోబర్ 9) కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. దీంతోపాటుగా మసబ్ ట్యాంకులో వందశాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ. 6. 5కోట్లు నిర్మాణం పూర్తిచేసుకున్న గిరిజన పరిశోధనా సంస్థ ట్రైబల్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్‌ను కూడా కేంద్రమంత్రులు ఇరువురూ కలిసి ప్రారంభించనున్నారు. రూ. 34 కోట్లతో నిర్మించనున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం కోసం కేంద్ర ప్రభుత్వం 2019-20లోనే రూ. 15 కోట్లు మంజూరు చేయడంతో పాటు దీనికి తెలంగాణ ప్రాంతానికి

(మిగతా 2లో..)

### వీర జవాన్‌కు కన్నీటి వీడ్కోలు..
#### సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా బోధన్ ప్రాంతానికి చెందిన ఆర్మీ జవాన్ సిక్కింలో చనిపోయాడు. డ్యూటీలో ఉండగానే భారీ వర్షాల కారణంగా నది ఉగ్రరూపం దాల్చింది. ఈ సందర్భంలో లాన్స్ నాయక్ హోదాలో ఉన్న ప్రసాద్ వరదల్లో కొట్టుకుపోయారు. గాలింపు చర్యల్లో మృతదేహం గురువారం లభ్యం కావడంతో ఆర్మీ అధికారులు పోస్టుమార్టం నిర్వహించి విమానంలో హైదరాబాద్ కు తరలించారు. ఆదివారం ఉదయం పార్థివ దేహాన్ని బోధన్ కు తీసుకొచ్చారు. బోధన్ మండలంలోని కుమ్మన్ పల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మృతి ఈ ప్రాంత ప్రజలను కలిసివేసింది. జవాన్ మృతదేహం తీసుకొస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు కుల మతాలకు అతీతంగా రోడ్లపైకి తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. జవాన్ స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకుని యువకులు ఆచన్ పల్లి భారీ బైక్ ర్యాలీ చేపట్టారు.

## ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య భీకరమైన పోరు..
### 1000 దాటిన మృతుల సంఖ్య



రమల్లా : ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య పోరు భీకరమైంది. ఇప్పటివరకు ఇరుదేశాల్లో మృతుల సంఖ్య 1000ను దాటినట్లు అధికారులు తెలిపారు. 3వేల మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారని అన్నారు. పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ 'ఆపరేషన్ అల్ అక్సా' పేరుతో తొలుత ఆకస్మిక దాడులు జరిపింది. అనంతరం దీనికి ప్రతీకారంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ ఏకంగా యుద్ధం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇరు పక్షాల మధ్య ఈ స్థాయిలో భీకర దాడులు జరగడం గత యాభై ఏళ్లలో ఇదే మొదటిసారి. శనివారం తెల్లవారుజామున గాజా సరిహద్దుల నుంచి 5వేల రాకెట్లు, డజన్ల కొద్దీ యుద్ధ విమానాల ద్వారా పాలస్తీనా ఇజ్రాయెల్ నగరాలపై మెరుపు దాడికి దిగింది. భూమి, ఆకాశం, సముద్ర మార్గాల్లో విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో ఇప్పటివరకు 300 మందికి పైగా మరణించారు. 1500 మందికిపైగా గాయపడ్డారు. అనంతరం ఇజ్రాయిల్ చేపట్టిన వైమానిక దాడుల్లో 232 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 1700 మంది తీవ్రంగా గాయపడ్డారు.

## తెలంగాణ ఆర్టీసీ కొత్త ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 8: తెలంగాణ ఆర్టీసీ కొత్త ఛైర్మన్ గా జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఆదివారం (అక్టోబర్ 8) ఆర్టీసీ బస్‌భవన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. త్వరలో ఎన్నికల కోడ్ రాబోతున్న నేపథ్యంలో బాధ్యతలు స్వీకరించినట్టుగా తెలుస్తోంది. ఇప్పటివరకు టీఎస్ ఆర్టీసీ ఛైర్మన్‌గా బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి కొనసాగిన సంగతి తెలిసిందే. ఆయన తదనంతరం ఆ స్థానంలో ముత్తిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆర్టీసీ ఛైర్మన్ గా ఈ పదవిలో ఆయన రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. తనను ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావుకి ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ ఎదుకుదలకు తన సాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి పేర్కొన్నారు. సంస్థలో సభ్యుడిగా పనిచేస్తూ, సంస్థ ఆదాయం పెరిగేందుకు అన్ని విధాలా సహకరిస్తానని ముత్తిరెడ్డి అన్నారు. కాగా ఈ సారి జరగనున్న తెలంగాణ ఎన్నికలకు ముత్తిరెడ్డికి బీఆర్ఎస్ టికెట్ కేటాయించకపోవడం గమనార్హం. బాధ్యతల స్వీకరణ అనంతరం తెలంగాణ ఆర్టీసీ ఛైర్మన్ ముత్తిరెడ్డి యాదగిరెడ్డి మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన ఎండీ వీసీ సజ్జనర్ నేతృత్వంలో టీఎస్ఆర్టీసీ అన్ని విభాగాల్లో ముందుకు దూసుకుపోతోంది. తనపై నమ్మకంతో ప్రభుత్వం ఈ బాధ్యతను అప్పగించిందందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు. నా శక్తి మేరకు ఆర్టీసీ సంస్థ వృద్ధికి పాటుపతాను. సంస్థ ఉద్యోగుల్లో ఒకరిగా సమిష్టిగా పని చేసి, టీఎస్ఆర్టీసీని లాభాల బాటవైపుకు తీసుకెళ్తాను. టీఎస్ఆర్టీసీ ఛైర్మన్ గా తనను నియమించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ముత్తిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వి రవిందర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, వినోద్ కుమార్ తోపాటు ఛైర్మన్ యాదగిరి రెడ్డి కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. కాగా టీఎస్ఆర్టీసీ ఛైర్మన్‌గా ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిని సీఎం కేసీఆర్ అక్టోబర్ 5న నియమించారు.

బహుజనులారా...
మేల్కొనండి...
• అల్ప సంఖ్యాకులైన అగ్రవర్ణాలు ఓటును అడుక్కుంటారు
• దయార్థ హృదయులైన బహుజనులు వారికి ఓటేస్తారు
• అత్యధిక జనాభా గలిగిన బహుజనులు సమస్యలు తీర్చమని అగ్రవర్ణాలను అడుక్కుంటారు
• అధికారంలో ఉన్న అగ్రకుల నాయకులు వీటిని పెడచెవిన పెట్టి, ఏళ్ల కొద్దీ సమస్యలను దాటవేస్తారు
• ఇదీ మన 76 సంవత్సరాల ప్రజాస్వామ్యం
పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితిని బలపరచండి
అడుక్కునే సంస్కృతిని సమాధి చెయ్యండి
డాక్టర్. కె. శివభాగ్యారావు బహుజన్,IRS-vrs
ఛైర్మన్ & ఫౌండర్ స్నేహ గ్రూప్

## ఉచిత గొర్రె పిల్లల పంపిణీ నీ ప్రారంభించిన ఎంపీపీ జల్లిపల్లి



అశ్వారావుపేట ప్రజాపాలన (ప్రతి నిధి) అశ్వారావుపేట మండలం గుర్రాల చెరువు గ్రామ పంచాయతీ నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందించే గొర్రె పిల్లలను అశ్వారావుపేట నియోజక వర్గ శాసన సభ్యులు మెచ్చా నాగేశ్వర రావు ఆదేశాల మేరకు ఆదివారంరోజు గొర్రె పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని అశ్వారావుపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు జల్లిపల్లి శ్రీరామమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రాల చెరువు గ్రామ పంచాయతీ లో మొత్తం 17 యూనిట్ల గొర్రె పిల్లల ను అందజేయటం జరుగుతుందని,దానిలో భాగంగానే ఈ రోజు ఈ గొర్రె పిల్లల పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఒక్కొక్క యూనిట్ కి 1,75000 రూపాయల విలువ చేసే 21 గొర్రె పిల్లలు ఉంటాయని, వీటి నిమిత్తం లబ్ధిదారులు తమ ఖాతాలలో 43750 రూపాయలు జమ చేసుకున్నారని మిగిలిన మొత్తం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో చెల్లిస్తుందిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు సర్పంచ్ కలపాల దుర్గయ్య,గోపాల కృష్ణ గొర్రెల సంగం అధ్యక్షుడు వీర్రాజు, పశువుల డాక్టర్ స్వప్న, పసువర్ధక శాఖ సిబ్బంది మదర్, బాబ్జి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె బాట పట్టనున్న 104 ఉద్యోగులు




మంచిర్యాల టౌన్, అక్టోబర్ 08, ప్రజాపాలన : సమ్మె బాట పట్టనున్న 104 ఉద్యోగులు అనితెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సి ఐ టి యు నాయకులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సి ఐ టి యు కార్యాలయం లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 104 లో పని చేస్తున్న అన్ని రకాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని గత కొన్ని రోజుల నుంచి ప్రభుత్వానికి వివిధ రూపాలలో వినతి పత్రాలు ఇవ్వడం ధర్నాలు కలెక్టరేట్ ముందు రిలే దీక్షలు నిర్వహించిన ప్రభుత్వం స్పందించకపోవడంతో చివరికి ఈ నెల 9 వ తారీకు నుంచి రాష్ట్రవ్యాప్త నిరవదిక సమ్మెకు యూనియన్ పిలుపునిచ్చారు. జిల్లాలో ఉన్న 104 ఉద్యోగులందరూ ఈ నిరవధిక సమ్మెలో పాల్గొని విజయప్రధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, పురుషోత్తం, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## కాన్షీరాం వర్ధంతి సభను విజయవంతం చేయండి




మంచిర్యాల టౌన్, అక్టోబర్ 08, ప్రజాపాలన : కాన్షీరాం వర్ధంతి సభను విజయవంతం చేయాలని బి ఎస్ పి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.గుణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశానుసారం ఈ నెల 9వ తేదీ సోమవారం రోజున బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్య శ్రీ కాన్షీరాం 17వ వర్ధంతి సభకు జిల్లా నుండి ఎవరి చద్ది వాళ్ళు కట్టుకొని హైదరాబాద్ లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ కి తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ బొడ్డు వినోద, చెన్నూరు నియోజకవర్గం అధ్యక్షులు తుంగపిండి రమేష్, బెల్లంపల్లి నియోజకవర్గం ఇంచార్జి వరప్రసాద్, కృష్ణ, రాజ్ కుమార్, సిద్దు, జశ్వంత్, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## కర్నూల్ సీడ్స్ పత్తి క్షేత్రస్థాయి ప్రదర్శన

**కంపెనీ సెల్స్ ప్రతినిధి లోనారే సురేష్**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సురేష్ చారి,అక్టోబర్ 6) : కర్నూల్ సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో కంపెనీ సెల్స్ ప్రతినిధులు లోనారే సురేష్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కంపెనీ సెల్స్ ప్రతినిధి సురేష్ మాట్లాడుతూ జిల్లాలోని వాంకిడి మండలం గాడ్ జనగాం గ్రామంలో "మాస్టర్ బిజీ టు అనే రకం" వాతావరణానికి తట్టుకొని అధిక దిగుబడిని ఇస్తుందని, క్షేత్రస్థాయి అవగాహన సదస్సులో రైతులకు అవగాహన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సెల్స్ ప్రతినిధులు, రైతులు, పాల్గొన్నారు

# మండలంలో దూకుడు పెంచిన కాంగ్రెస్

**నాలుగోసారి మధిర గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం అంటున్న నాయకులు**

**పొంగులేటి, తుమ్మల అనుచరులు తోడవడంతో మండలంలో కాంగ్రెస్లో మరింత జోష్**




బోనకల్, అక్టోబర్ 8 ప్రజా పాలన ప్రతినిధి: మండలంలో కాంగ్రెస్ దూకుడు పెంచింది. మండల వ్యాప్తంగా కాంగ్రెస్కు అనుకూల పరిస్థితులు వస్తుండడం ఇదే సమయంలో ఆ పార్టీ సైతం మరింత జోష్తో ముందుకు పోతుంది. ఈ నేపథ్యంలో మండలానికి చెందిన కాంగ్రెస్ ముఖ్యనేతలు పార్టీ బలోపేతంపై దృష్టి సారించారు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకు కాంగ్రెస్ ముఖ్యనేతలు, నాయకులు స్థానికంగానే ఉంటూ ప్రజల్లోకి వెళు న్నారు. ప్రధానంగా చేరికలపై కాంగ్రెస్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో ఇతర పార్టీల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్లోకి భారీగా వలసలు వచ్చారు. ఇదే సమయంలో వివిధ పార్టీల అసంతృప్తి నేతలపై మండల కాంగ్రెస్ నేతలు దృష్టి సారించారు. అసంతృప్తి నేతలను కాంగ్రెస్లోకి చేర్చుకునేందుకు గాలం వేస్తున్నారు. మరోవైపు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీలను నియమిస్తున్నారు. మండలంపై జిల్లా కాంగ్రెస్ అధిష్ఠానం సైతం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా మధిర నియోజకవర్గం లో 4వ సారీ భట్టి విక్రమార్క గెలుపుతో విజయ డంకా మోగించి కాంగ్రెస్ పాగా వేయాలని ఆ పార్టీ ముఖ్యనేతలు వ్యూహాలు రచిస్తున్నారు. ఈ నేపథ్యంలో చేరికలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్లో చేర్చుకునేందుకు రాయభారాలు నడుపుతున్నారు. గతంలో కాంగ్రెస్లో ఉండి వేరే పార్టీలో వెళ్లిన వారిని మరల పార్టీలో చేర్చుకునేందుకు మంతనాలు జరుపుతున్నారు. ఇప్పటికే పలువురు నేతలు రావడానికి సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతుంది. కొంతమంది బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్లో చేరేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం ? ఇటీవల జిల్లాలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ చెందిన పలువురు ముఖ్యనేతలు కాంగ్రెస్లో చేరారు. మండలంలో పొంగులేటి అనుచరులతో పాటు తుమ్మల అనుచరులు తోడవడంతో కాంగ్రెస్ లో మరింతగా జోష్ పెరిగింది. నియోజకవర్గంలో వలు మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు సైతం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ నేపథ్యంలో బోనకల్ మండలంలో మరి కొంతమంది కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చసాగుతోంది. కొంతమంది బిఆర్ఎస్ నాయకులు ఆ పార్టీలో తగిన గుర్తింపు రావడం లేదని కొన్ని రోజులుగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది..? ఇదే క్రమంలో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటుండడం ఆ పార్టీల్లో చర్చ జోరుగా సాగుతుంది. ఈ తరుణంలో కాంగ్రెస్ నేతలు బిఆర్ఎస్ అసంతృప్తి నేతలతో టచ్లో ఉన్నట్లు తెలుస్తోంది.? ప్రధానంగా మండలంలో బీఆర్ఎస్ పార్టీలో పలువురు నాయకులు, కార్యకర్తలు తీవ్ర అనహనంతో ఉన్నట్లు సమాచారం. బీఆర్ఎస్లో గల అసంతృప్తి నాయకులు కాంగ్రెస్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. బిఆర్ఎస్ లో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్న వారంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారనే చర్చ మండలంలో జోరుగా సాగుతోంది. రానున్న రోజుల్లో పలువురు ముఖ్యనేతలు కాంగ్రెస్లో చేరుతారనే ప్రచారం నడుస్తుంది.

ఇదే అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం సైతం బీఆర్ఎస్ అసంతృప్తులపై గాలం వేస్తున్నట్లు మండలంలో చర్చించుకుంటున్నారు. ఏదేమైనా కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా మధిర నియోజకవర్గంలో నాలుగోసారి మధిర గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయం అంటూ కాంగ్రెస్ నాయకులు ముందుకు వెళుతున్నారు.

## అనాథ బాలికల సంక్షేమం కోసం సంరక్షణ కేంద్రం

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావాత్ మోతిలాల్**




మంచిర్యాల బ్యూరో, అక్టోబర్ 8, ప్రజాపాలన :అనాధ బాలికలు, ప్రత్యేక అవసరాలు గల బాలికల సంక్షేమం కోసం జిల్లా శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సంరక్షణ కేంద్రం పనిచేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావాత్ మోతిలాల్ అన్నారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్ మండలంలో గల ఆర్. కె. 5 కాలనీలో బాలసదనం చిల్డ్రన్ హోమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎవరైనా అనాథ బాలికలు, అవసరాలతో ఉన్న బాలికలు, సంరక్షణ అవసరమైన బాలికలకు ఈ సంరక్షణ కేంద్రంలో ఉచితంగా వారికి కావాల్సిన విద్య, వసతి అందించి తగిన రక్షణ కల్పించడం జరుగుతుందని, మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎవరైనా ఇలాంటి బాలికలు ఉన్నట్లయితే జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో, బాల రక్ష భవన్ లో సంప్రదించాలని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైనటువంటి ఉమెన్ హబ్ ఉద్యోగులకు నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఆనంద్, మంచిర్యాల సి.డి.పి.ఓ. విజయలక్ష్మి, చెన్నూరు సి.డి.పి.ఓ. మనోరమ, లక్షెట్టిపేట సి.డి.పి.ఓ. రేష్మ, సూపరిండెంట్ హేమ సత్య, సూపర్వైజర్స్, బాలల సంరక్షణ, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలి

**కుర్నవల్లిలో ఐలూరి వెంకట కోటారెడ్డి, జక్కంపూడి కృష్ణమూర్తి**



తల్లాడ, అక్టోబర్ 8 (ప్రజా పాలన న్యూస్): సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎవరికీ ఇచ్చిన అందరం కలిసి పని చేస్తామని ఆ పార్టీ నాయకులు అయిలూరి వెంకటకోటారెడ్డి, జక్కంపూడి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం తల్లాడ మండలంలోని కుర్నవల్లి గ్రామంలో కాంగ్రెస్, సిపిఎం, తెలుగుదేశం పార్టీల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల ప్రకారం సత్తుపల్లి అభ్యర్థి ఎవరైనా వారికి సంపూర్ణ మద్దతు తెలియజేయాలన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కొందరు బీఆర్ఎస్ నాయకులు మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారని, వాటిని తిప్పికొట్టాలన్నారు. ఐదేళ్లలో లేని అభివృద్ధి పది రోజులుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు కలిసి వచ్చే నాయకులు, పార్టీని కలుపుకొని పోయి ముందుకు తీసుకుపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దిరిశాల నరసింహారావు, కొమ్మినేని ప్రభాకర్ రావు, ఎంపీటీసీ దగ్గుల రఘుపతి రెడ్డి, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, పగడాల లచ్చిరెడ్డి, వడ్డే రామారావు, శీలం సత్యనారాయణరెడ్డి, ఉప్పెర్ల రామారావు, ఐలూరి శ్రీనివాసరెడ్డి, దగ్గుల నాగిరెడ్డి, గంటల వెంకటాచారి, కేతేపల్లి భాస్కరరావు, గోవిందు శ్రీనివాసరావు, మారెళ్ళ మల్లికార్జునరావు, తాళ్ల జోసెఫ్, పొన్నం కృష్ణయ్య, గనేశుల రవి, ఎర్రి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ అవకాశాలు కల్పించేవారికే ముదిరాజుల మద్దతు



సంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో అరవైలక్షల పైచిలుకు జనాభా ఉన్న ముదిరాజ్ లకు ఏ రాజకీయ పార్టీ రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో అవకాశం కల్పిస్తుందో అపార్టీకి ముదిరాజుల మద్దతు ఉంటుందని సంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పులిమామిడి రాజు స్పష్టం చేశారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో జరిగే ముదిరాజుల ఆత్మగౌరవ సభకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ముదిరాజ్ సంఘం జిల్లా కార్యాలయం నుండి ముదిరాజులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ సంఖ్యలో వాహనాలలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పులిమామిడి రాజు ఆధ్వర్యంలో తల్లి తెలంగాణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పులిమామిడి రాజు మాట్లాడుతూ... సంగారెడ్డి జిల్లాలోని అయిదు నియోజకవర్గాలనుండి వెయ్యి వాహనాలలో ర్యాలీగా ఆత్మగౌరవ సభకు తరలి వెళ్లడం జరుగుతుందన్నారు. భారతీయ జనతా పార్టీ ఈటెల రాజేందర్ కు ఎన్నికల కమిటి చైర్మన్ పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించిందన్నారు. పార్టీలకు అతీతంగా జెండా అజెండాలను ప్రక్కన పెట్టి ముదిరాజులు తరలి రావాలని పిలుపునిచ్చారు. బిసిలందరికి న్యాయం జరిగేందుకే ఈ సభ ప్రధాన లక్ష్యం అని చెప్పారు. బిసిలందరితో కలిసి రాజ్యాధికారం సాధిస్తామని తెలిపారు. ఈ సభ ఒక మైలురాయిగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఆయన వెంట ముదిరాజ్ సంఘం నాయకులు పిట్టల రమేష్ తదితరులు ఉన్నారు.

## నేడు హైదరాబాద్లో రాంజీగోండు

(మొదటి పేజీ తరువాయి)




చెందిన గిరిజన స్వాతంత్ర్య పోరాటయోధుడు రాంజీగోండు పెట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 25 కోట్లు వెచ్చిస్తోంది. ఈ మ్యూజియం ఎలా ఉండాలి, ఇందులో ఏయే అంశాలను పొందుపరచాలనే విషయంపై.. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన సూచనలు ఇచ్చింది. మొత్తం మూడు అంతస్తులుగా ఉండే ఈ మ్యూజియంలో మొదటి అంతస్తులో నిర్మల్ ఘాట్లలో రాంజీ గోండు ఆధ్వర్యంలో జరిగిన పోరాట ఘట్టాలు, వెయ్యి ఉరుల మర్రి దృశ్యాలను ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేస్తోంది. నాటి పోరాట యోధులు వాడిన వస్తువులు ప్రదర్శనకు ఉంచుతారు. రెండో అంతస్తులో మన తెలంగాణ ప్రాంతానికి చెందిన గిరిజన పోరాట యోధుడు కొమురం భీమ్, బిర్సా ముండా, మన్యం గిరిజన పోరాటానికి సంబంధించిన ఘట్టాలను చూపించే ఏర్పాట్లుంటాయి. మూడో అంతస్తులో.. తెలంగాణ ప్రాంతంలో ఉండే అత్యంత వెనుకబడిన గిరిజన సమూహాలు కు సంబంధించిన కళలు, కళాకృతులు, ఆచార వ్యవహారాలను తెలిపే ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు, మాసబ్ ట్యాంక్లో 0.3 ఎకరాలు రూ. 6.5 కోట్లతో నిర్మించే ట్రైబల్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్ ద్వారా.. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన తెగల చరిత్ర, వారి సంస్కృతి, సంప్రదాయాలు, వారి సంరక్షణ గురించి ఈ కేంద్రం ద్వారా పరిశోధిస్తారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ కిషన్ రెడ్డి.. హైదరాబాద్ నగరంలో ఈ రెండు కేంద్రాల ఏర్పాటుకోసం కృషిచేస్తున్న సంగతి తెలిసిందే. ఎట్టకేలకు రీసర్చ్ కేంద్రం ప్రారంభం అవుతుండటం, మ్యూజియంకు శంకుస్థాపన జరగడంతో.. తెలంగాణ స్వాతంత్ర్యం కోసం గిరిజనులు చేసిన త్యాగాలకు సరైన గుర్తింపు లభించడంతోపాటుగా.. వారి సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేసేలా పరిశోధలు జరగనున్నాయి.

## ఉప్పల్ కాంగ్రెస్.. తిప్పలు వేరయా!

(మొదటి పేజీ తరువాయి)

గతంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్రెడ్డి పర్యటన సందర్భంగా రెండు గ్రూపుల మధ్య ఫ్లెక్సీ కొట్లాట జరిగింది. వీరిపై పోలీసు కేసులు కూడా నమోదు చేసుకోవడం గమనార్హం. అయితే ఉప్పల్లో బీఆర్ఎస్పార్టీ బలంగా ఉండటంతో పోటీ చేయడానికి ప్యారాచూట్ నేతలు వస్తారని ప్రచారం సాగుతుంది.

**ఇదీ చరిత్ర**

2009లో ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంగా మారింది. నాటి నుంచి లెక్కిస్తే ఒక్క సారి మాత్రమే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిచారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా రాలేదు. ఆ తర్వాత జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పది డివిజన్లలో పోటీ చేస్తే ఒక్క డివిజన్లో స్వల్ప మెజారిటీతోనే ఆ పార్టీ అభ్యర్థి గెలిచారు. మిగితా తొమ్మిది డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే విజయకేతనం ఎగురువేశారు. ఇక 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి కూడా లేకపోవడంతో క్యాడర్ పూర్తిగా నిరుత్సాహంలోకి వెళ్లింది. అప్పుడు కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న బండారి లక్ష్మారెడ్డి 2018లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2020లో జరిగిన గ్రేటర్ ఎన్నికల్లో రెండు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించినా, మిగితా 8 చోట్ల కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయింది. రెండవ స్థానంలో కూడా నిలువలేకపోయింది. 2018లో గులాబీ పార్టీ విజయకేతనం ఎగురవేసింది. ఇదే స్ఫూర్తితో వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ఉప్పల్ నియోజక వర్గంలో గులాబీ పార్టీ జెండా ఎగురుతుందని స్థానిక ఓటర్లు గట్టి నమ్మకంతో ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే కలెక్టరేట్ ల ముందు బూట్ పాలిష్ చేసి నిరసన తెలుపుతాం : లిడ్ క్యాప్ భూముల పరిరక్షణ కమిటీ



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి): చర్మ కార వృత్తి నిర్వహించే కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని తెలంగాణ చర్మకారుల,లెదర్ పరిశ్రమల భూముల పరిరక్షణ కమిటీ నూతన అధ్యక్షుడు కూసపాటి శ్రీనివాస్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మా భూములు మాకేనని అన్న అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షులు చింత స్వామి,ఇమాన్యుయేల్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూసపాటి శ్రీనివాస్, మహిళ అధ్యక్షురాలిగా ఇ. లత, ప్రధాన కార్యదర్శిగా జి. కుమార్ లతో పాటు కార్యావర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చర్మ కార వృత్తి నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించక పోతే ప్రతీ జిల్లా కలెక్టరేట్ ముందు ఈ నెల 16 న బూట్ పాలిష్ చేస్తూ నిరసన తెలుపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పలు జిల్లాల నుండి సభ్యులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలను ప్రారంబించిన సీఐ వెంకటేశ్వర్లు





ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ తేదీ 8 ప్రజాపాలన ప్రతినిధి :తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూర్ గ్రామం 15వ వార్డ్ లోని వెంకటాద్రి నగర్ కాలనీలో సీ సి కెమెరాలను ప్రారంభించిన హయత్ నగర్ సి ఐ వెంకటేశ్వర్లు హయత్ నగర్ ఎస్ ఐ సురేష్ 15వ వార్డ్ కౌన్సిలర్ తుర్క యంజాల్ మున్సిపాలిటీ బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు వేముల స్వాతి అమరేందర్ రెడ్డిఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ నక్క రమేష్ గౌడ్,15వ వార్డ్ బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు దోమలపల్లి శివ కుమార్,మాజీ వార్డ్ మెంబెర్ వెంకటేష్,కాలనీ కమిటీ సభ్యులు కాలనీ మహిళలు,తదితరులు పాల్గొనడం జరిగింది.

## బండారి లక్ష్మారెడ్డికి మద్దతు తెలిపిన రజక సంఘం ప్రతినిధులు




మేడిపల్లి, అక్టోబర్ 8 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి రామంతాపూర్ రజక సంఘం ప్రతినిధులు మద్దతు తెలిపారు.రామంతాపూర్ డివిజన్ రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రజక కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను లక్ష్మారెడ్డి అడిగి తెలుసుకున్నారు. కొత్త బోర్ మరియు చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరగా సమస్య ఎలాంటిదైనా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయిస్తానని లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రజకసంఘం అధ్యక్షులు బొడ్డుపల్లి లింగమయ్య, ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి దానయ్య మరియు ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు గంథం నాగేశ్వరరావు,శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తమ్మారపు వేదంత్ ఆశీర్వదించిన పోటు



బోనకల్, అక్టోబర్ 8 ప్రజా పాలన ప్రతినిధి: సిపిఐ మండల సీనియర్ నాయకులు, సీనియర్ పాత్రికేయులు తమ్మారపు వెంకటేశ్వర్లు మనవడు తమ్మారపు వేదంత్ అన్నప్రాసన మహోత్సవ కార్యక్రమం మండల కేంద్రంలో అదివారం నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పాల్గొని బాబును ఆశ్వీరందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గం సభ్యులు కొండపర్తి గోవిందరావు, తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, మేఘశ్రీ హాస్పటల్ జనరల్ వైద్య నిపుణులు టి పవనకుమార్, సిపిఐ నాయకులు ఆకెన పవన్, తమ్మారపు భార్గవ్, యంగల గిరి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ లోకి భారీ చేరికలు



ఇబ్రహీంపట్నం సెప్టెంబరు తేదీ 8 ప్రజాపాలన ప్రతినిధి :దండుమైలారం గ్రామానికి చెందిన యువత భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ కి ఆకర్షితులై కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిట్టల సీతయ్య, రావనవోని లింగం ఆధ్వర్యంలో సుమారు 100 మంది యువత మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లోకి చేరారు.ఈ మేరకు మల్ రెడ్డి గారు పార్టీ కండువ కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. యువత చేరికతో దండుమైలారం గ్రామానికి మరింత బలం చేకూరిందని అని అన్నారు.ఈ మేరకు ఇబ్రహీంపట్నం మండల జడ్పీటీసీ భూపతి గళ్ళ మహిపాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి తో కలిసి దండుమైలారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. దండుమైలారం నూతన కమిటీ గ్రామ అధ్యక్షుడు - నిట్టు గాలయ్య, ఉపాదక్షులు - మేకల శ్రీరాములు, యూత్ అధ్యక్షుడు - బీర్ల వెంకటేష్, ఉపాదక్షుడు - కరికే మల్లేష్

## లింగాల కరుణమ్మ దిశ దినకర్మకు హాజరైన పలువురు ప్రముఖులు



మధిర అక్టోబర్ 7 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నందు లింగాల కరుణమ్మ సంస్మరణ సభ సంస్మరణ సభకు వేలాదిగా హాజరైన ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయపార్టీనాయకులు, శ్రేయోభి లాషుల మాతృమూర్తి మరణంతో ఉద్వేగాన్ని దిగమింగుకుని కార్యక్రమాన్ని నడిపించిన జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు సంస్మరణ సభకు హాజరై లింగాల కమల్ రాజు గారి కుటుంబ సభ్యులు పరామర్శించిన ఎంపీలు నామ నాగేశ్వరరావు , వద్దిరాజు రవిచంద్ర ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ కొండ బాల కోటేశ్వరరావు డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం రైతుబంధు సమితి కన్వీనర్ వెంకటేశ్వరరావు టిడిపి ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పలువురు ప్రముఖులుజెడ్పి చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్ రాజు మాతృమూర్తి లింగాల కరుణమ్మ ఇటీవల మరణించిన విషయం విధితమే కాగా ఆదివారం నాడు మధిర నియోజకవర్గ కేంద్రం మధిర పట్టణం లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు లింగాల కరుణమ్మ సంస్మరణ సభ ఏర్పాటు చేయడం జరిగిందిఈ సంస్మరణ సభకు మధిర నియోజకవర్గం లోని అన్ని మండలాల నుండి ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు వేలాదిగా హాజరయ్యారు.. మాతృమూర్తి మరణంతో ఉద్వేగాన్ని దిగమింగుకొని కార్యక్రమాన్ని జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు నడిపించారు. ఈ సంస్మరణ సభకు పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు రాజ్యసభ సభ్యులు వద్ది రాజ్ రవిచంద్ర ఎమ్మెల్సీ తాత మధుసూదన్ , సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు , డిసిసిబి చైర్మన్ కొరకు నాగభూషణం , టిడిపి ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ రామనాథం, రైతుబంధు సమితి కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు సహా పలువురు ప్రముఖులు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, పలు సంఘాల వారు హాజరై లింగాల కమల్ రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి సంఘీభావం వారు తెలిపారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు అభిమానులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న జీవో 317ను రద్దు చేయాలి



అసిఫాబాద్ జిల్లా అక్టోబర్ 8 (ప్రజాపాలన,ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 317 తో జిల్లాలోని నిరుద్యోగులకు పూర్తి అన్యాయం జరిగిందని, ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్య పరిష్కరించాలని, ఖిరిడీ గ్రామానికి రోడ్డు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయాలని, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శి టీకానంద్, కార్తీక్ లు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకు నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుందని, ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు చూపించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఉపాధి కోసం కనీసం కార్పొరేషన్ లోన్లు కూడా ఇవ్వడం లేదని, నిత్యజీవులు చదువుకోడానికి గ్రంథాలయాలు, స్టడీ సెంటర్లు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ముఖ్యంగా సరైన సౌకర్యాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, యువత మైదానాలు లేక వారి నైపుణ్యతను కోల్పోతున్నారన్నారు. కాగజ్ నగర్ లో ఉన్న ఎస్పీఎం ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వక ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోతున్నారని అన్నారు. గిరిజన ప్రాంతాలకు సరైన రోడ్ల సౌకర్యాలు లేక త్రాగునీటి సౌకర్యం అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిరుద్యోగులు 317 జీవో వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పడానికి డివైఎఫ్ఐ జిల్లా కమిటీ, జిల్లాలో ఉద్యమాలు చేస్తామని, ప్రజల కోసం పనిచేయని నాయకులని ఎన్నికల్లో ఓడిస్తామని, ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో 317 ని రద్దు చేయాలని, స్థానికత ఆధారంగా ఉద్యోగాలు భర్తీ చేయాలని, జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు శ్రీకాంత్, సతీష్, రాజేష్,సవిత, లక్ష్మి,జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ సి పి పార్టీ జిల్లా స్థాయి సమావేశం



మంచిర్యాల టౌన్, అక్టోబర్ 08, ప్రజాపాలన : నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశం పట్టణం లోని ఐ బి గెస్ట్ హౌస్ లో ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సట్లపెల్లి మహేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుమ్మిడి గోపాల్ మాట్లాడుతూ పార్టీని జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని అన్నారు. పార్టీ తెలంగాణ లో అన్ని నియోజకవర్గాల్లో పోటీలో ఉంటుందని అని త్వరలో అభ్యర్థుల జాబితా ను ప్రకటిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నీలం సురేందర్,నేషనలిస్ట్ స్టూడెంట్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పురేళ్ల నీతిష్, యూత్ అధ్యక్షులు జాడి నరేందర్,జిల్లా నాయకులు మల్లేష్,రమేష్,రాజన్న, రాజబాబు, యూత్ రాష్ట్ర నాయకులు రేగుంట క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అసమర్ధత వల్లనే అభివృద్ధి కుంటుపడిందిలి

### కాంగ్రెస్ పార్టీ నాయకులు




మంచిర్యాల టౌన్, అక్టోబర్ 08, ప్రజాపాలన : మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అసమర్ధత వల్లనే నియోజకవర్గం కుంటుపడింది కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సిరిపురం రాజేష్, మాజీ కౌన్సిలర్ పూదరి ప్రభాకర్, అశోక్ తేజ లు మాట్లాడుతూ ఎన్నికలు సమీపించడంతో శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు హడావుడి గా చేస్తున్నారని విమర్శించారు. మంత్రి హరీష్ రావు ఎమ్మెల్యే వల్ల చెడ్డపేరు ఉందని ఒడిపోతాడని హైదరాబాద్ లో చెప్పగా ఇప్పుడు ఇక్కడకు వచ్చి ఇంద్రుడు, చంద్రుడు అంటూ పొగడటం విచారకరమని అన్నారు. మంచిర్యాల టూ టౌన్ అభివృద్ధి చెందిందని ఆ ప్రాంత బీ ఆర్ ఎస్ కౌన్సిలర్ పచ్చి అబద్ధాలు ఆడడం తగదని సూచించారు. ఎక్కడ అభివృద్ధి జరిగిందో ప్రజలకు తెలుసని అన్నారు. ఓవర్ బ్రిడ్జి కట్టాలని మెజార్టీ ప్రజలు సంతకాల ద్వారా కోరితే రాజకీయ దురుద్దేశ్యము తో అండర్ బ్రిడ్జి నిర్మించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు. 100 ఫీట్లు, 60 ఫీట్ల రోడ్ విస్తరణ ఎందుకు చేపట్టడం లేదని నిలదీశారు. ఎమ్మెల్యే దివాకర్ రావుకు నియోజకవర్గం అభివృద్ధి పై భవిష్యత్ ప్రణాళిక లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు ఉప్పలయ్య ఉప నాయకుడు వేములపల్లి సంజీవ్,మజీద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి,పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 269వ ఉచిత మెగా వైద్య శిబిరం



మేడిపల్లి, అక్టోబర్ 8 (ప్రజాపాలన ప్రతినిధి):మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 269వ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఉప్పల్ నియోజకవర్గం కుషాయిగూడ లోని శ్రీ చక్రి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. గత 25 సంవత్సరాలుగా మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉప్పల్ నియోజకవర్గంలో అనేక రకాల ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మా రెడ్డి.ఈ మెగా క్యాంప్లో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, గైనకాలజీ, ఆప్తమాలజీ,విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు.కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు మధుర చారిటబుల్ ట్రస్ట్ వారు సొంత ఖర్చుతో ఉచితంగా ఉప్పల్ నియోజకవర్గం ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, మందులను అందజేస్తున్న రాగిడి లక్ష్మా రెడ్డి. ఈ మెగా మెడికల్ క్యాంపును కాసుల పోచయ్య గౌడ్, ఎస్ రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజిరెడ్డి, రాఘవరెడ్డి, పలకల నరసింహారెడ్డి, ఎన్. సుధాకర్ చారి చేతుల మీదుగా ప్రారంభించారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

సోమవారం 09,అక్టోబరు 2023

## మృత్యుబీభత్సం లేని ఓ యుద్ధం!

నిజమైన యుద్ధమా? కాదు. మూడేళ్లు తక్కువగా మూడు దశాబ్దాల క్రితం (1996) నాటి ప్రపంచ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను 'కాల్పులు లేని యుద్ధం' (వార్ మైనస్ ది షూటింగ్)గా అమెరికన్ పాత్రికేయుడు మైక్ మారూ?ృసీ అభివర్ణించారు. అదే శీర్షికతో ఆయన ఆ టోర్నమెంట్‌పై సవివరమైన ఒక ప్రశస్త పుస్తకాన్ని కూడా వెలువరించారు. ఇరవై ఏడు సంవత్సరాల అనంతరం ఇప్పుడు ఇండియా, పాకిస్థాన్‌ల మధ్య క్రికెట్ పోటీ ఆనాటి కంటే కూడా మరింతగా 'యుద్ధ స్వభావం'ను సంతరించుకుంది. ఈ పరిస్థితిని, మైక్ పుస్తక శీర్షిక ఆనాడే చక్కగా సూచించిందనడంలో సందేహం లేదు. 1996లో అయితే భారత ఉపఖండంలోని మూడు దేశాల- ఇండియా, పాకిస్థాన్, అంతిమ విస్మయకర విజేత శ్రీలంక సంయుక్తంగా ఆ ప్రపంచ కప్ టోర్నమెంట్‌ను నిర్వహించాయి. మరి ఇప్పుడు? అది అసంభవం. ఏ మాత్రం ఆలోచించలేని విషయం. అంతకంతకూ పెరిగిపోతోన్న స్పర్ధాత్మక, శ్రుతి మించిన జాతీయవాద భావోద్వేగాలు ఇండియా-పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌ను ఆవహించి ఉన్నాయి. వాఘా సరిహద్దుకు ఆవల, ఈవల కూడా పనిగట్టుకుని ఆ భావోద్వేగాల వాతావరణాన్ని కల్పించారు. సరే, ఇండో -పాక్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించడానికి ఆరాటపడని క్రికెట్ అభిమానులు ఎవరు ఉంటారు? అది, అహ్మదాబాద్‌లో జరగడం ఉభయ దేశాల మధ్య ప్రస్తుత సంబంధాల వాస్తవ పరిస్థితిని సంకేతాత్మకంగా సూచిస్తుంది. అహ్మదాబాద్ నగరం గురించి మాట్లాడుకుంటున్నాం కదూ! గత మూడు దశాబ్దాలుగా ఆ నగర రాజకీయాలలో సంఘ్ పరివార్ ప్రాబల్య పాత్ర వహిస్తోంది. 2002లో ఆ నగరంలో చోటుచేసుకున్న హిందూ-ముస్లిం అల్లర్లు నాడే కాదు, నేడూ తీవ్ర భీతిని గొలుపుతున్నాయి. మతపరమైన అస్తిత్వాలు ఆ మహానగరంలో అంతర్గత దృశ్యమాన 'సరిహద్దుల'ను సృష్టించాయి! ప్రపంచంలోనే అతి పెద్ద క్రికెట్ స్టేడియం అహ్మదాబాద్‌లో ఉన్నది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరిట దానికి నామకరణం చేశారు. ప్రభవిస్తోన్న ప్రపంచశక్తిగా భారత్‌కు ఒక విలక్షణ సమున్నత హోదా కల్పించాలన్న ఆశలు, ఆకాంక్షలను దృఢ హిందూత్వతో కలగలిపిన శక్తిమంతమైన జాతీయ వాద రాజకీయాలకు ప్రతీకగా వెలుగొందుతున్న నాయకుడు మోదీ. హిందూత్వ జాతీయవాదులలో అత్యధికులు భారతీయ ముస్లింను ఒక 'అంతర్గత శత్రువు'గా చూస్తారుబీ పాకిస్థాన్‌ను ఒక ప్రధాన 'శత్రు దేశం'గా పరిగణిస్తారు. ఆరు నూరైనా సరే, ఆ శత్రు రాజ్యాన్ని ఏకాకిని చేసి, అస్తిత్వాన్ని కోల్పోయేరీతిలో పరాజితను చేసి తీరాలన్నది వారి అభీష్టం. మరి భారతీయ జనతా పార్టీ తన సొంత మెజారిటీతో ఇంచుమించు ఒక దశాబ్దం క్రితం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ, పాకిస్థాన్‌తో క్రీడా పరమైన సంబంధాలను సాధ్యమైనంతగా పరిమితం చేసుకునేందుకు ఇండియా ప్రత్యేక శ్రద్ధ చూపడంలో ఆశ్చర్యమేముంది? న్యూఢిల్లీ వైఖరి స్పష్టమే : సీమాంతర ఉగ్రవాద కార్యకలాపాలు, క్రికెట్ సంబంధాలు పరస్పరం పొసగవు. ఈ సందర్భంగా ఒక ఆసక్తికరమైన విషయాన్ని ప్రస్తావించి తీరాలి. 2004లో టీమిండియా పాకిస్థాన్‌లో పర్యటించేందుకు పచ్చ జెండా ఊపింది అటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వమే. క్రీడా రంగంలోనైనా సంబంధాలు మెరుగుపడి, పటిష్ఠమైతే ఉభయ దేశాల మధ్య అన్ని రంగాలలో సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు అవకాశమున్నదని ఆ రాజనీతిజ్ఞుడు భావించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి అటువంటి భ్రమలు ఏమీ లేవు. 2014లో తన పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌నూ ఆహ్వానించి మోదీ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ తరువాత డిసెంబర్ 2015లో ఆహ్వానం లేకుండానే నవాజ్ షరీఫ్ ఇంట ఒక వివాహ మహోత్సవానికి మోదీ హాజరయ్యారు. 2016లో పఠాన్ కోట్, యూరీలో ఉగ్రవాద దాడులతో ఈ తరహా దౌత్యాలకు తెరపడింది. యూరీలో ఉగ్రవాద దాడుల అనంతరం వ్యూహాత్మక సంయమన విధానానికి స్వస్తి చెప్పి పాకిస్థాన్ లోతట్టు ప్రాంతాలలో సర్జికల్ దాడులకు ఆదేశించారు. అవి విజయవంతమయ్యాయి. ఆ సందర్భంగా 'ఘర్ మే ఘుస్కర్ మారా' (వారి సొంతగడ్డ పైనే వారిపై దాడి చేశాము) అని మోదీ ప్రకటించారు. పుల్వామా, బాలాకోట్ ఘటన అనంతర చర్యలు మోదీ ప్రభుత్వ వైఖరిలో ఒక స్పష్టమైన మార్పును ప్రతిబింబించాయి. 'దోస్తీ' (స్నేహం) నుంచి 'దుష్మని' (శత్రుత్వం)కి మోదీ సర్కార్ పూర్తిగా మొగ్గింది. ఆ తరువాత పరిస్థితులు మరింతగా దిగజారాయి. తత్కారణంగానే ఇప్పుడు న్యూఢిల్లీ, ఇస్లామాబాద్‌ల మధ్య రాజకీయంగా సుహృద్భావ సంబంధాలు లేవు. న్యూఢిల్లీ వైఖరిలో నిర్ణయాత్మక మార్పునకు పుల్వామా, అంతకు ముందు 26/11 దాడులు కారణమయితే ఆగస్టు 2019లో జమ్మూ కశ్మీర్‌లో అధికరణ 370 రద్దు దౌత్య సంబంధాలను తగ్గించుకునేందుకు ఇస్లామాబాద్‌ను పురిగొల్పింది. వాణిజ్య సంబంధాలు చాల వరకు తగ్గిపోయాయి. ఇక ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాల పునరుద్ధరణ విషయమై ఎలాంటి కబుర్లకు ఆస్కారం లేకుండా పోయింది. భారత ఉపఖండ క్రికెట్ దిగ్గజాలలో నిస్సందేహంగా అగ్రగణ్యుడు అయిన ఇమ్రాన్ ఖాన్ 2018లో పాకిస్థాన్ ప్రధానమంత్రి అయ్యారు. 'ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణలో భారత్ ఒక అడుగు ముందుకు వేస్తే మేము రెండు అడుగులు ముందుకు వేస్తామని' ఇమ్రాన్ ప్రకటించారు. అయితే ఇండో-పాక్ సంబంధాలు మరింతగా దిగజారిపోయాయి. దెబ్బకుదెబ్బ తీసుకోవడమే ఇరుదేశాల విధానమైపోయింది. క్రికెట్ చిక్కుల్లో పడింది. ఈ ఏడాది పాకిస్థాన్ ఆసియా కప్ టోర్నమెంట్‌ను నిర్వహించినప్పుడు టీమిండియా పాక్‌లో ఆడదని భారత క్రికెట్ బోర్డు స్పష్టం చేసింది. ఇందుకు ప్రతి చర్యగా ప్రపంచ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు తమ టీమ్ భారత్‌లో పర్యటించే ప్రసక్తే లేదని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తొలుత బెదిరించింది. ఈ రెండు జట్లు శ్రీలంకలో ఆడేందుకు ఒక అంగీకారం కుదిరింది. తుదకు అహ్మదాబాద్‌లో ప్రత్యక్షంగా తలపడేందుకు భారత్, పాకిస్థాన్‌లు సమ్మతించాయి. ఈ జగడం విశదం చేసినదేమిటి? రెండు దేశాల మధ్య సంబంధాలు సమస్థాయిలో లేవనే కాదూ? అపార ధనరాశులు ఉన్న భారతీయ క్రికెట్ బోర్డు ప్రపంచ క్రికెట్ వ్యవహారాలను నిర్దేశిస్తోంది, శాసిస్తోంది శ్రీలంక టీమ్ ప్రయాణిస్తున్న బస్సుపై ఉగ్రవాదుల దాడి ఫలితంగా పాకిస్థాన్‌లో పర్యటించేందుకు అంతర్జాతీయ క్రికెట్ టీమ్‌లు చాలా సంవత్సరాలుగా తిరస్కరిస్తున్నాయి. తనకు ఎదురవుతున్న ఈ ప్రతికూల పరిస్థితిని సరిచేసుకునేందుకు భారత క్రికెట్ బోర్డు నిర్దేశించిన విధంగా వ్యవహరించడం పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు అనివార్యమయింది. ఒక విధంగా భారత క్రికెట్‌పై భారతీయ జనతా పార్టీ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. భారత ప్రజలు అసాధారణంగా ఆదరించే, అభిమానించే ఆట వ్యవహారాలపై నియంత్రణకు జాతీయ పాలక పక్షం నియంత్రణ కొనసాగింపే భారత క్రికెట్ బోర్డు రాజకీయాలు. అలాగే ఇటీవల అనంతనాగ్‌లో వారం రోజుల పాటు లష్కర్ ఉగ్రవాదులు చెలరేగిపోయిన తీరునూ చూడండి. కశ్మీర్ లోయలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థానీ గూఢచార సంస్థ ఐఎస్ఐ ఇప్పటికీ పూర్తి స్థాయిలో అండదండల నందిస్తున్నదని స్పష్టమయింది. లష్కర్ మిలిటెంట్ల దాడిలో భారత సైన్యం ఒక కల్నల్, ఒక మేజర్‌ను కోల్పోయింది. ఇంతా చేస్తూనే భారత్‌ను ఒక 'దుష్మన్ ముల్క్' (శత్రు దేశం)గా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ జాకా అష్రఫ్ ప్రస్తావించారు.

# దుస్థితిలో ఆర్థిక వ్యవస్థ !

ప్రజల ఆదాయాలు తగ్గడం, ధరలు పెరుగుతుండడం, నిరుద్యోగం పెరుగుతుండడం, తయారీ రంగ వృద్ధిలో క్షీణత... ఇవన్నీ కలిసి ఉధృతమవుతున్న ఆర్థిక దుస్థితిని ప్రతిబింబిస్తున్నాయి. ఆశ్రితుల ఆస్తుల వృద్ధికి ఆశ్రయం కల్పించడం ఆపి, దానికి బదులుగా ప్రభుత్వ వనరులను ప్రజా పెట్టుబడులకు ఉపయోగించి, ఎంతగానో అవసరమైన మౌలిక వసతులను నిర్మించాల్సిన అవసరం వుంది. దీనివల్ల ఉద్యోగాలు కల్పించబడతాయి. ఆర్థిక వ్యవస్థలో దేశీయ డిమాండ్ పెరుగుతుంది. అయితే, దేశ జాతీయ ఆస్తులను దోపిడీ చేయడం ద్వారా తమ లాభాలను గరిష్టంగా పెంచుకునేందుకు విదేశీ, దేశీయ పెట్టుబడులకు మోడీ ప్రభుత్వం విధేయత కనబరుస్తున్నందున, ఈ సంక్షోభం మరింత అధ్వాన్నంగా మారుతుంది. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతూ రాజధాని న్యూ ఢిల్లీలో గత ఆదివారం లక్షల సంఖ్యలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రదర్శన జరిపారు. ఇంతటి బృహత్తరమైన ప్రజా ప్రదర్శనకు సంబంధించిన కవరేజీ... మన దేశాన్ని పట్టి పీడిస్తున్న తీవ్ర ఆర్థిక మాంద్యం ప్రతిబింబాన్ని... అస్పష్టంగా కేవలం ఒక సంఘటనగా వర్ణించడానికి మాత్రమే పరిమితమైంది. పాత పెన్షన్ పథకం ప్రకారం, ఒక ఉద్యోగి చివరిసారిగా తాను అందుకున్న జీతంలో 50 శాతాన్ని బోనస్‌గా అందుకుంటాడు. ఈ మొత్తం కూడా ప్రతి ఏడాదీ ద్రవ్యోల్బణానికి తగినట్లుగా సర్దుబాటు అవుతూ వుంటుంది. మరోవైపు కొత్త పెన్షన్ పథకంలో ఉద్యోగి అందుకునే పెన్షన్ పాత పెన్షన్ పథకం కింద వచ్చే మొత్తంలో సగానికి మించదు. 2004 తర్వాత సర్వీసులోకి ప్రవేశించిన వారందరూ కొత్త పెన్షన్ పథకానికి మాత్రమే అర్హులని చట్టం పేర్కొంటోంది. ఇరవయ్యేళ్ల తర్వాత వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలను ప్రభావితం చేసే సమస్యగా ఇది మారిందన్నది వాస్తవం. పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న ఆదాయాలతో భారతదేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న జీవన వ్యయ సంక్షోభాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. మధ్య తరగతి వారికి కూడా జీవనోపాధులు మరింత దుర్భరంగా మారుతున్నాయి. కొత్త పెన్షన్ పథకాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినపుడు, పెన్షన్ అనేది కార్మికుడి హక్కు అని, అంతేకానీ ప్రభుత్వమిచ్చే నిరుద్యోగ భృతి కాదు అన్న సూత్రానికి కట్టుబడి సిపిఎం ఈ కొత్త పెన్షన్ పథకాన్ని వ్యతిరేకించింది. ఈ నాడు, ఆ వ్యతిరేకతకు గల కారణాలు ధృవీకరించబడుతున్నాయి. మన దేశ ప్రజానీకం వాస్తవిక ఆదాయాలు కృశించిపోతున్నాయి. దీంతో జీవనం మరింత దుర్భరంగా మారుతోంది. దేశ ఆర్థికారోగ్యం కూడా తీవ్రంగా ప్రభావితమవుతోంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో దేశీయ డిమాండ్ తక్కువవుతోంది. పెట్టుబడులు దెబ్బతింటున్నాయి. ఇటువంటి పెట్టుబడులతో తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ వుండడం లేదు. ఉత్పత్తి చేసింది వెంటనే అమ్ముడయ్యి లాభాలు వచ్చి, అభివృద్ధి నమోదైతేనే పెట్టుబడులు పెరుగుతాయి. డిమాండ్, పెట్టుబడులు లేనపుడు ఆర్థిక వృద్ధి కూడా



జరగదు. ఈ నాడు భారతదేశ ఆర్థిక వ్యవస్థను పట్టి పీడిస్తున్న ప్రాథమిక సమస్య ఇది. మోడీ ప్రభుత్వ హయాంలో మతం-కార్పొరేట్ బంధం మరింత బలపడుతుండడంతో, దేశంలో ఉత్పత్తి అయ్యే సంపదలో ప్రధాన భాగం ఆశ్రితుల చేతుల్లో వుంటోంది. అదానీ వ్యవహారం ఇందుకు మంచి ఉదాహరణగా వుంది. మెజారిటీ ప్రజలను పణంగా పెట్టి కొద్ది మంది ఆశ్రితులను మరింత సుసంపన్నులను చేయడానికి దేశ సంపద మళ్లించబడుతోంది. మోడీ ప్రభుత్వం అనుసరించే ఆర్థిక విధానాలు రెండు భారత దేశాలను-సంపన్నులకు ప్రకాశంతమైన భారత దేశాన్ని, నిరుపేదలకు బాధలు పడుతున్న భారతాన్ని-సృష్టించే క్రమానికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. అయితే, భారతదేశం పుంజుకుంటోందని, జిడిపి దృష్ట్యా చూసినట్లైతే ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా పయనిస్తోందంటూ మోడీ ప్రభుత్వం అవిశ్రాంతంగా చేస్తున్న ప్రచారం పేర్కొంటోంది. ప్రభుత్వానికి ఎవరు నాయకత్వం వహిస్తారనే దానితో నిమిత్తం లేకుండా, ప్రస్తుత గణాంకాల ధోరణులను బట్టి చూసినట్లైతే, 2027లో భారత్ మూడవ స్థానంలో వుంటుంది. కానీ, తలసరి జిడిపి దృష్ట్యా భారత్ ఎక్కడ వుంటుందనేదే వాస్తవం. తలసరి జిడిపి దృష్ట్యా చూసినట్లైతే, ఈనాడు ప్రపంచంలో భారత్ ర్యాంక్ 142. కొత్తగా ఆవిర్భవిస్తున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను చూపెట్టేందుకు ఇటీవల జరిగిన జి-20 సదస్సును ఉపయోగించుకున్నారు. కానీ, మళ్ళీ వాస్తవాలు పరిశీలిస్తే అసలు సత్యం బోధపడుతుంది. జి-20 దేశాలన్నింటిలోకి అత్యంత తక్కువ తలసరి జిడిపి భారత్‌దే. అలాగే మానవ వనరుల అభివృద్ధిలో కూడా దిగువ స్థానంలోనే వుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత తక్కువ కార్మిక ప్రాతినిధ్యం రేటు వున్న రికార్డు కూడా మనదే. అంటే అత్యంత ఎక్కువగా నిరుద్యోగ సమస్య నెలకొందన్నమాట. దీనివల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోంది, ఫలితంగా, స్థూల ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతోంది. గతేడాది కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పెట్టుబడులు వచ్చే కొత్త ప్రతిపాదనలు 72.5 శాతం క్షీణించగా, ప్రైవేటు పెట్టుబడులు 79.2 శాతం తగ్గాయి. 'మేక్ ఇన్ ఇండియా' పదేళ్ల ఘన విజయంపై పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అసలు ఇందులో నిజం ఏమిటి? 2013-14 నుండి తయారీ రంగం వృద్ధి సగటున 5.9 శాతం వుంది. పెట్టుకున్న లక్ష్యం మాత్రం 12-14 శాతంగా వుంది. కానీ ఈ లక్ష్యాన్ని సాధించలేదు. జిడిపిలో తయారీ రంగం వాటా 25 శాతం వుండాలని లక్ష్యంగా పెట్టుకోగా 16.4 శాతం దగ్గరే స్తంభించిపోయింది. 2011-12, 2021-22 మధ్య కాలంలో తయారీ రంగంలో ఉద్యోగాలు 12.6 శాతం నుండి 11.6 శాతానికి క్షీణించాయి. ఒబిసిలకు విశ్వకర్మ ప్రాజెక్టులను ఎర్ర కోట నుండి ప్రధాని మోడీ ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. నైపుణ్యాలు కలిగిన కళాకారులకు రూ.13 వేల నుండి రూ.15 వేల కోట్లు ఖర్చు పెడతామని చెప్పారు. అయితే, పార్లమెంట్‌లో ప్రకటించింది చూసినట్లైతే, రాబోయే ఐదేళ్ల కాలంలో రూ.13 వేల కోట్ల రుణాల ప్యాకేజీని ఐదు శాతం వడ్డీతో పంపిణీ చేస్తామని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో దుస్థితి కూడా పెరుగుతోంది. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్) డిమాండ్ గతేడాది కాలంలో 16.3 శాతం పెరిగింది. 2019-20 నుండి చూసినట్లైతే ఒక్కసారిగా 29.4 శాతం పెరిగింది. ఇది, మనుగడ కోసం ప్రజలు పడుతున్న దుస్థితి స్థాయిని తెలియచేస్తోంది. వాస్తవిక వేతనాలు ప్రతికూల అభివృద్ధిని నమోదు చేశాయని 2022-23 సంవత్సరానికి ఆర్థిక సర్వే పేర్కొంది. ఆర్థిక కార్యకలాపాలు క్షీణించాయన్నది వీటన్నింటి ఫలితంగా వుంది. దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, ప్లాస్టిక్‌లు, రత్నాలు, ఆభరణాలు వంటి కార్మిక శ్రమ ఎక్కువ వుండే ఎగుమతులు క్షీణించడంలో ఇది కనిపిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో భారత్ వాటా బాగా తగ్గుతోంది. అంటే ఈ రంగాల్లో దేశీయ ఉపాధి కూడా బాగా తగ్గుతోందనే అర్థం. ఫలితంగా ఆగస్టులో నిరుద్యోగం రేటు 8.1 శాతంగా వుంది. 2022లో యువత (15-24 సంవత్సరాలు) లో నిరుద్యోగం 23.22 శాతంగా వుంది. పట్టభద్రుల్లో ఇది ఏకంగా 42 శాతంగా వుంది. 2023 ఆగస్టులో దాదాపు 2 కోట్ల కుటుంబాలు ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ కింద పని కావాలని డిమాండ్ చేశాయి. భారతదేశ ప్రజల డివిడెండ్‌ను మోడీ ప్రేరేపించిన విధ్వంసం ఇది. ఉపాధి తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి. గత కొన్నేళ్ళుగా ఆర్‌బిఐ పెట్టిన పరిమితి 6 శాతాన్ని ద్రవ్యోల్బణం అధిగమిస్తూనే వుంది. అంతకన్నా అధ్వాన్నమేంటంటే, ఆహార పదార్థాలు, నిత్యావసరాల ధరలు పెరుగుతుండడంతో ఈ ద్రవ్యోల్బణం ఇంకా పెరుగుతోంది. జిడిపి శాతంగా కుటుంబాల ఆర్థిక ఆస్తులు క్షీణించడమే ఈ మొత్తం సంక్షోభానికి ప్రధాన కారణంగా వుంది. 2020-21లో 15.4 శాతంగా వున్న ఈ ఆస్తులు 2022-23లో 10.9 శాతానికి పడిపోయాయి. బతకడం కోసం ప్రజలు తమ కుటుంబ ఆస్తులుగా వచ్చిన వెండి, బంగారాలను అమ్ముకుంటున్నారు. కుటుంబాల నికర ఆర్థిక ఆస్తులు 11.5 శాతం నుండి 5.1 శాతానికి పడిపోయాయి. ప్రజల ఆదాయాలు తగ్గడం, ధరలు పెరుగుతుండడం, నిరుద్యోగం పెరుగుతుండడం, తయారీ రంగ వృద్ధిలో క్షీణత... ఇవన్నీ కలిసి ఉధృతమవుతున్న ఆర్థిక దుస్థితిని ప్రతిబింబిస్తున్నాయి. ఆశ్రితుల ఆస్తుల వృద్ధికి ఆశ్రయం కల్పించడం ఆపి, దానికి బదులుగా ప్రభుత్వ వనరులను ప్రజా పెట్టుబడులకు ఉపయోగించి, ఎంతగానో అవసరమైన మౌలిక వసతులను నిర్మించాల్సిన అవసరం వుంది. దీనివల్ల ఉద్యోగాలు కల్పించబడతాయి. ఆర్థిక వ్యవస్థలో దేశీయ డిమాండ్ పెరుగుతుంది. అయితే, దేశ జాతీయ ఆస్తులను దోపిడీ చేయడం ద్వారా తమ లాభాలను గరిష్టంగా పెంచుకునేందుకు విదేశీ, దేశీయ పెట్టుబడులకు మోడీ ప్రభుత్వం విధేయత కనబరుస్తున్నందున, ఈ సంక్షోభం మరింత అధ్వాన్నంగా మారుతుంది. భారతదేశ సంపదను ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ప్రజల సంక్షేమానికి పెట్టుబడిగా పెట్టేలా చూసేందుకు గాను ప్రభుత్వ అధికార పగ్గాలు బిజెపి చేతుల్లో వుండకుండా చూడడం ఎంతో ముఖ్యం.

# వ్యాఖ్యాన చక్రవర్తి మల్లినాథుడు

తన అసామాన్య ప్రతిభాపాటవాలతో తెలుగువారి, అందునా తెలంగాణ జాతి కీర్తిని ఆసేతుహిమాచల పరివ్యాప్తం చేసిన విద్వన్మణులలో అగ్రగణ్యుడు మహామహోపాధ్యాయ వ్యాఖ్యానచక్రవర్తి కోలాచల మల్లినాథసూరి. మహాకవి కాళిదాసు, భారవి, మాఘమహాకవి, శ్రీహర్షుడు, భట్టిమహాకవి వంటి ఉద్దండులు రచించిన మహాకావ్యాల మహౌన్నత్యాన్ని అర్థం చేసుకునేట్టు అనితరసామాన్యమైన వ్యాఖ్యాన పరంపరను అందించిన మల్లినాథ సూరి సంస్కృత వ్మాయంలో, వ్యాఖ్యాన రంగంలో చక్రవర్తిత్వ బిరుదాన్ని పొందిన ఏకైకపండితుడు. శాస్త్రాధ్యయనానికి, వేదాధ్యయనానికి, అవధానవిద్యకు, పౌరాణికవిద్యకు, ధర్మశాస్త్రబోధనకు ప్రాచీనకాలం నుం చే ప్రసిద్ధిగాంచిన తెలంగాణాలోని మెదక్ జిల్లా కోలాచలం (ప్రస్తుతం కుల్చారం)కు చెందిన మహాపురుషుడు. మల్లినాథసూరి అపార పాండిత్యానికి ముగ్ధుడైన రాచకొండ అధిపతి సర్వజ్ఞ సింగభూపాలుడు మహామహోపాధ్యాయ, వ్యాఖ్యాన చక్రవర్తి ఇత్యాది బిరుదులతో సత్కరించినట్టు శాసనాలు స్పష్టం చేస్తున్నాయి. మల్లినాథసూరి తాత పేరు కూడ మల్లినాథుడే. ఆ కాలంలోనే తన శతావధానాలతో కవిపండితులందరి మెప్పు పొందిన మహాకవి ఆయన. కాకతీయవంశపు రాజైన వీరరుద్రుని చేత సన్మానింపబడిన మహామేధావి. కోలాచలాన్వయాబ్దిందుః మల్లినాథో మహాయశాః, శతావధానవిఖ్యాతో వీరరుద్రాభివర్షితః అని పదయోజనాకారుడైన వెంకట నా రాయణ పండితుడు ఆ విషయాన్ని స్పష్టం చేశాడు. 'ప్రతాపరుద్రీయం'కు రత్నాపణ వ్యా ఖ్యానం వ్రాసిన కుమారస్వామి తను వ్యాఖ్యా తృ సార్వభౌముడైన మల్లినాథసూరి తనయుణ్ణని అనేక సందర్భాల్లో తెలిపాడు. మల్లినాథుడు బాల్యంలో తనతండ్రి దగ్గరనే విద్యాభ్యాసం చేశాడని, ఆ తర్వాత అనుష్ఠానబలం తో శాస్త్రాలన్నీ వివిధగురువుల వద్ద అభ్యసించాడని పరిశోధకుల అభిప్రాయం. అంతవరకు అక్కడక్కడా కావ్యాలకు, శాస్త్రగ్రంథాలకు రాసిన వ్యాఖ్యానాల అసమగ్రతను, క్లిష్టతను, అన్వయ క్రమరాహిత్యాన్ని గ్రహించి మహాకవుల కావ్యాలకు అతుల్యమైన వ్యాఖ్యానాలను రచించాడు. పదచ్ఛేదః పదార్థోక్తిః విగ్రహో వాక్యయోజనా, ఆక్షేపశ్చ సమాధానం వ్యాఖ్యానం షడ్విధం మతమ్ అని వ్యాఖ్యానలక్షణం చెప్పబడినప్పటికీ అది వ్యాకరణశాస్త్రాన్ని దృష్టిలో పెట్టుకొని చెప్పబడిందే, అయితే దీన్నే ఆధారంగా తీసుకొని మహాకావ్యాలకు ఇతరశాస్త్రగ్రంథాలకు కూడ వ్యాఖ్యానం రచించి వ్యాఖ్యానానికి ఒక కొత్త రూపాన్ని లక్షణాన్ని నిరూపించిన సుధీమణి మల్లినాథసూరి. నా మూలం లిఖ్యతే కించిత్ నానపేక్షితముచ్యతే అని దృఢంగా చెప్పిన మొట్టమొదటి వ్యక్తి మల్లినాథసూరి. ఆయన వ్యాఖ్యానవల్లరిని మల్లెపూల గుబాళింపుతో పోల్చారు వి ద్వాంసులు. ఆయనే లేకపోతే ఎన్నో మహాకావ్యాలు నూరు ఆమడల దూరంలో ఉండిపొయ్యేవి అనడంలో ఏమాత్రం సందేహం లేదు. వ్యాఖ్యానాల్లో మల్లినాథుని పాండిత్యపు లోతును గమనించుటకు యత్నిస్తే ఎన్ని శాస్త్రాలలో ఆయనకు ఎంత దృఢమైన ప్రవే శం ఉందో మన ఊహక్కూడ అందదనడం లో ఆశ్చర్యం లేదు. వేదాలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు, స్మృతులు, సం పూర్ణ వ్యాకరణశాస్త్రం, తర్కం, పూర్వమీమాంస, వేదాంతం, అర్థశాస్త్రం, కామశాస్త్రం, ఆయుర్వేదం, జ్యోతిశ్శాస్త్రం,అశ్వ, గజ, రత్నా ది శాస్త్రాలు, శకునశాస్త్రం, సాముద్రికశాస్త్రం, మంత్రశాస్త్రం, నాట్యశాస్త్రం ఇత్యాదుల విశేషాలన్ని సందర్భోచితంగా తన వ్యాఖ్యానాల్లో చూపెట్టిన వ్యక్తి కేవలం మల్లినాథపండితుడే. అమరకోశం, మేదినీకోశం, వైజయంతీకోశం, నానార్థరత్నమాల, విశ్వకోశం, ద్విరుక్తకోశం, యాదవ నిఘంటువు ఇత్యాది అనేకనిఘంటువుల ప్రామాణ్యాన్ని అవసరమున్న చోట ల్లా ఉదాహరించిన మహామేధావి మల్లినాథసూరి. అంతేగాక అష్టాదశ పురాణాలలోని అంశాలనెన్నింటినో సందర్భోచితంగా ప్రమాణంగా చూపెట్టిన పురాణ విజ్ఞాన సర్వస్వం మల్లినాథుడు. వ్యాకరణ విషయకమైన సందే హం ఆయా కావ్యాల్లో తలెత్తినప్పుడు సాధారణంగా పండితులు అష్టాధ్యాయిని, వైయాకరణ సిద్ధాంత కౌముదిని మాత్రమే అనుసరించి పదప్రయోగంలో కానీ, ధాతుప్రయోగంలో కానీ మహాకవుల ప్రయోగాలను సమర్థించలేకపోవడం సాధారణమే, కాని మల్లినాథసూరి ఐంద్రం చాంద్రం కాశకృత్స్నం కౌమా రం శాకటాయనమ్, సారస్వతం చాపిశలం శాకలం పాణినీయకమ్ అనే నవవ్యాకరణాలతో పాటు సరస్వతీ కంఠాభరణం, జైనేంద్ర వ్యాకరణం, హైమ వ్యాకరణం వంటి గ్రంథా లు, కాశికా, పదమంజరీ, మహాభాష్యాది వ్యాఖ్యానాలను కూడ ఉదాహరిస్తూ మహాకవులందరిని, వారి కవితాధారను సమర్థించిన తీరు అద్భుతం. అందుకే కాశీకి వెళ్లి మల్లినాథుని వ్యాఖ్యాసహితంగా పంచమహాకావ్యా లు మేఘసందేశం, భట్టికావ్యం అభ్యసించిన వారిని మహావిద్వాంసునిగా తలచేవారు.

# ఫ్రీ బీలపై సుప్రీం సీరియస్

న్యూఢిల్లీ, అక్టోబరు 8 :ఐదు రాష్ట్రాల ఎన్నికల నగారా మోగనున్న వేళ సుప్రీంకోర్టులో ఒక కీలక పిటిషన్ దాఖలైంది. ఓటర్లకు నగదు, ఉచిత కానుకలు పంచకుండా రాజకీయ పార్టీలను కట్టడి చేయాలని కోరుతూ మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక సామాజిక కార్యకర్త సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల వేళ మరోసారి ఉచితపథకాలపై దేశవ్యాప్తంగా రచ్చ మొదలైంది. ఆదాయం లేకపోయినా అప్పులు చేసి మరీ ప్రభుత్వాలు డబ్బులు పంచుకుంటూ పోతున్నాయని వెంటనే కట్టడి చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇప్పటికే రాష్ట్రాలు అప్పులపాలవుతున్నాయని.. అయినా ఓట్ల కొనేందుకు ట్యాక్స్ పేయర్స్ డబ్బు వాడుకుంటున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. కేసును విచారించిన సుప్రీం ధర్మాసనం.. సమాధానం చెప్పాలంటూ రెండు రాష్ట్రాలకు, కేంద్రానికి అటు ఎన్నికల సంఘానికి నోటీసులు ఇచ్చింది. సరిగ్గా ఇదే సమయంలో తెలంగాణలోనూ పార్టీలు హామీలు ఇవ్వడంలో పోటీపడుతున్నాయి. ఉచిత పథకాలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నంలో ఉన్నాయి ప్రధానపార్టీలు. ఉచితాలకు సంబంధించి సమగ్ర మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఉందని అత్యున్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. పన్ను చెల్లింపుదారుల ధనాన్ని ఇలా కానుకలుగా పంచడం సబబుకాదని న్యాయస్థానానికి తెలిపారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు నగదు, కానుకల పంపిణీ మొదలువుతుందనే విషయాన్ని పిటిషనర్ న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చే ఓటర్లకు రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలను తాము నియంత్రించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆజ చంద్రచూడ్, జస్టిస్ ఏః పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. ఈ పిటిషన్‌పై సమాధానం చెప్పాలని కోరుతూ సుప్రీంకోర్టు ? కేంద్రం, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రులను ప్రతివాదులుగా చేస్తూ ఈ పిటిషన్ దాఖలైంది. కాని, ముఖ్యమంత్రులను తొలగించి ఆ రాష్ట్రాల పేర్లు చేర్చాలని సుప్రీంకోర్టు సూచించిందిఈ తరహా పిటిషన్‌లో గతంలో కూడా సుప్రీంకోర్టులో దాఖలైంది.

# కులనిర్మూలన గ్రంథము - ఒక పరిశీలన

## తాతపూడి రవీంద్రనాథ్ టాగోర్

ఈరోజు ఒక సంచలనాత్మకమైన గ్రంథాన్ని మీ ముందుకు తెస్తున్నాను. 1936లో ప్రచురించబడిన ఈ పుస్తకం నాటి భారత దేశ సమాజంలో ఎంతగా ప్రకంపనలు రేపిందంటే సాక్షాత్తు మహాత్మా గాంధీ అంతటి ప్రజాధరణ కలిగిన నాయకుడు ఈ గ్రంథం పై తన అభిప్రాయాలు తన హరిజన్ పత్రిక లో ప్రచురించవలసి వచ్చింది. ఆ గ్రంథం పేరే కుల నిర్మూలన 'Annihilation of Caste. ఈ గ్రంథ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అనే విషయం తెల్సిందే. ఈ గ్రంథం రాయబడిన పరిస్థితుల గురించి అందులోని విషయాలను గురించి క్లుప్తంగా తెలుసుకుందాం. హిందూ సంఘం నుండి కుల వ్యవస్థను నిర్మూలించే లక్ష్యంతో పని చేసే "జాత్ పాత్ తోడక్ మండల్" అనే సంస్థ 1936లో జరుప తలపెట్టిన తమ వార్షికోత్సవ సభకు అధ్యక్షత వహించి ప్రసంగించాలని అంబేద్కర్ గారిని ఆహ్వానించారు. మొదట తిరస్కరించినా తరువాత అంగీకరించిన అంబేద్కర్, లాహెూర్లో జరగబోయే ఆ సభలో అధ్యక్ష ప్రసంగంగా తయారు చేసుకున్న వ్యాసమే ఈ గ్రంథం. అయితే అంబేద్కర్ గారు వెలిబుచ్చిన అభిప్రాయాలతో అంగీకారం కుదరని ఆహ్వాన సంఘం వారు ఆ సభను రద్దు చేసుకోవడం జరిగింది. కానీ చిన్నిపుస్తకంగా అచ్చువేయబడ్డ అంబేద్కర్ ప్రసంగపాఠమే ఈ "కుల నిర్మూలన" గ్రంథం. ఈ చిన్ని పుస్తకమే తరువాత కాలంలో బహుజన వాద సిద్ధాంతానికి ప్రామాణిక గ్రంథం అయింది అనడం అతిశయోక్తి కాదు. "ఎనయ్ లేషన్ ఆఫ్ క్యాస్ట్" పేరున ఇంగ్లీషులో వ్రాయబడ్డ ఈ పుస్తకం అన్ని భారతీయ భాషలలోకి తర్జుమా చేయబడింది. అనేక ప్రతులు అంటే కాపీలు అమ్ముడు పోయాయి, పోతున్నాయి. బాబాసాహెబ్ గారి సమయంలోనే మూడుసార్లు ముద్రించబడింది. బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించి బాలితులను పాలకులుగా మార్చిన మాన్యశ్రీ కాన్షిరాం తాను ఈపుస్తకం ద్వారా ప్రభావితుడయ్యా నానని అనేక సందర్భాల్లో ప్రకటించిన విషయం గమనార్హం. 64 పేజీల ఈ గ్రంథాన్ని అంబేద్కర్ రచనలు ప్రసంగాలు మొదటి సంపటంలో రెండవ పుస్తకంగా పొందుపరిచారు విడిగా కూడా దొరుకుతుంది. ఈ పుస్తకం చదవడం మొదలుపెడితే బాబాసాహెబ్ అంబేద్కర్ మనతో స్వయంగా మాట్లాడుతున్నట్టు ఉంటుంది. ఒక ప్రసంగంలాగాకాక పరిశోధక వ్యాసం లా ఉంటుంది. ఈ గ్రంథం గురించి క్లుప్తంగా చెప్పుకోవాలంటేభారత సమాజంపై బ్రాహ్మణ భావజాలం యొక్క ప్రభావం ఆధిక్యత ఆ ఆధిపత్యం నిలుపుకోవడానికి వేళ్ళూనుకున్న వర్ణవ్యవస్థల పరిణామ క్రమాన్ని శాస్త్రీయంగా చర్చిస్తారు బాబాసాహెబ్. వర్ణ వ్యవస్థ నుంచి పుట్టుకొచ్చిన కులం వ్యవస్థ తద్వారా కుల వివక్ష హిందూ సమాజాన్ని ఎలా విచ్ఛిన్నం చేసిందో సవివరంగా వ్రాశారు. ఆ కాలంలో గుజరాత్ లో జరిగిన సంఘటనలు కుండలకు బదులు బిందెలు వాడినందుకు శూద్ర స్త్రీల పైన, భోజనంలో నెయ్యి వడ్డించినందుకు అస్పృశ్యుల పైన జరిగిన అమానుష దాడులను ఆకృత్యాలను వివరించారు. ఒక వర్గం ప్రజలను అణగద్రొక్కి ఉంచే అధికారం వేరొక వర్గానికి లేదని నినదించారు. రాజకీయవిప్లవాలకు, మతవిప్లవాలకు గల పరస్పర సంబంధాలను విపులీకరిస్తారు. కులవ్యవస్థ అనేది శ్రమవిభజన మాత్రమే కాదు, శ్రామికుల విభజన కూడా అంటారు. దేశంలో ఏ దిక్కుకు తిరిగినా దారికి అడ్డంగా నిలబడే పెనుభూతం కులం. ఈభూతాన్ని చంపి పారేయందే రాజకీయ ఆర్థిక సంస్కరణలు సాధ్యం కావని నొక్కి వక్కాణిస్తారు. అసలు "హిందూ" అనే పదమే విదేశీ పదమని అది మహమ్మదీయులు పెట్టిన పేరని చెప్పింది ఈ పుస్తకంలోనే. చాతుర్వర్ణ వ్యవస్థ సవర్ణ స్త్రీలకు కూడా సముచిత స్థానం ఇవ్వకుండా అణచివేసిందని పురోహితులుగా సైనికులుగా స్త్రీలను అనుమతించని విషయం సభ్య సమాజం ముందు చర్చకు పెట్టారు. హిందువులలోని కులాలు హైందవ్యాత్రులలోని శాఖలు ఒకటే అనే భ్రమలో నుంచి హిందువులు బయటపడాలని హితవు పలికారు. కులం పునాదుల మీద ఒక జాతిని గాని నీతిని గాని నిర్మించలేమని ప్రకటించింది కూడా ఈ పుస్తకంలోనే. కేవలం సమస్యను ఎత్తిచూపటమే కాకుండా కుల నిర్మూలన మాత్రమే సమస్యకు సరైన పరిష్కారమని ప్రతిపాదించారు. కుల వ్యవస్థను రద్దు చేయడానికి సరైన మందు వర్ణాంతర వివాహాలేనని సూచించారు. కుల నిర్మూలన జరగాలంటే పోరాటం చేయవలసింది వ్యక్తులతో కాదు, అట్టి కులవ్యవస్థతో కూడిన మతాన్ని వాళ్లకు బోధిస్తున్న శాస్త్రాలను ఎదుర్కోవాలని శాస్త్రాలపట్ల, వాటి పవిత్రతలపట్ల ప్రజలకున్న విశ్వాసాన్ని తొలగించాలని పిలుపునిస్తారు. ప్రాచీన జీవన నిబంధనలు రద్దు కావాలని మత సంస్కరణలు జరగాలని మత సంస్కరణకు కావలసిన ముఖ్యమైన అంశాలను సూచించారు. అందులో ముఖ్యంగా పూజారి వ్యవస్థ వంశపరంగా ఒకకులానికే పరిమితం కాకుండా అర్హతల ఆధారంగా అన్ని కులాల వారికి అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా: హిందూ మతాన్ని భారతీయ వాతావరణాన్ని కలుషితం చేసిన కుల వ్యవస్థను కూకటివేళ్ళతో పీకి పారవేయ కలిగినప్పుడే హిందూ మతాన్ని రక్షించిన వారవుతారని కర్తవ్యం బోధిస్తారు. అంతేకాకుండా, చాలా మందికి తెలియని అనేక చారూ విషయాలు మన ముందుంచిన ఈ గ్రంథాన్ని అందరూ తప్పకుండా చదవాలని కోరుకుంటున్నాను

# నకిలీ సర్టిఫికెట్ల గోల్ మాల్

హైదరాబాద్, అక్టోబరు 8 : తెలంగాణ మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారంలో నకిలీ స్థానిక ధృవీకరణ పత్రాల వ్యవహారం కలకలం రేపుతోంది. నకిలీ ధృవపత్రాలతో అక్రమంగా ఎంబిబిఎస్ సీట్లను పొందిన ఏడుగురు విద్యార్థులపై తెలంగాణ పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరి అడ్మిషన్లను రెండు రోజుల క్రితం కాళోజీ యూనివర్శిటీ రద్దు చేసింది. వీరిలో కొందరిని ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఏపీకి చెందిన పోపులు సుబ్రహ్మణ్య సాయితేజ, వానిపెంట సాయిప్రీతికారెడ్డి, తమ్మినేని విష్ణుతేజారెడ్డి, తన్నీరు సంజయ్, అరికట్ల హనుమాన్ రెడ్డి, టేకులపల్లి మహేష్, గేర్లె భార్గవ్ ధర్మతేజ, యశ్వంత్ నాయుడులను అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. తప్పుడు ధృవీకరణ పత్రాలు రూపొందించిన కన్సల్టెన్సీ నిర్వాహకుడు కామిరెడ్డి నాగేశ్వరరావును కూడా గుర్తించారు. విజయవాడలో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న నాగేశ్వరరావు ఈ అక్రమాలకు ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. విద్యార్థులతో పాటు నిర్వాహకుడిపై వరంగల్ మట్టెవాడ పిఎస్‌లో కేసు నమోదైంది. కాళోజీ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఎంబిబిఎస్,బిడిఎస్ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కాళోజీ వర్శిటీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ క్రమంలో ఎంబిబిఎస్ సీట్లు వచ్చిన ఏడుగురు విద్యార్థులు సమర్పించిన పత్రాలపై వర్శిటీ అధికారులకు అనుమానం రావడంతో దర్యాప్తు జరిపారు. విద్యార్థులు ఆరు నుంచి 9వ తరగతి వరకు తెలంగాణ రాష్ట్రంలో చదువుకున్నట్లు పత్రాలు సమర్పించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా వీరికి లోకల్ కోటలో సీట్లను కేటాయించారు. విద్యార్థులు పదోతరగతితో పాటు ఇంటర్ ఆంధ్రప్రదేశ్‌లో చదువుకున్నారు. నీట్ పరీక్షను కూడా విజయవాడ లోనే రాశారు. వీరిని అనుమానించిన యూనివర్శిటీ అధికారులు ఒరిజినల్ పత్రాలతో నేరుగా వర్శిటీలో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని ఆదేశించారు. విద్యార్థులు తమ తరపున కన్సల్టెన్సీ నిర్వాహకుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాడని వెల్లడించారు. కామిరెడ్డి నాగేశ్వర రావు తమ తరపున ధృవపత్రాలను అప్‌లోడ్ చేసినట్లు చెప్పడంతో ఆ ధృవపత్రాలను నకిలీగా తేల్చిన యూనివర్శిటీ అధికారులు విద్యార్థులతో పాటు నిర్వాహకుడిపై ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. ఏపీలో చదువుకున్న విద్యార్థికి తెలంగాణలో స్థానిక ధృవీకరణ ఏ ప్రాతిపదికన ఇచ్చారో వివరణ ఇవ్వాలంటూ అలంపూర్ తహసీల్దార్‌కు తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. మెడికల్ సీట్ల భర్తీలో 85శాతం స్థానిక కోటా విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులను ఇప్పటికే హైకోర్టు సమర్థించింది. స్థానికత విషయంలో మాత్రం సడలింపులు ఇచ్చింది. ఈ క్రమంలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు కర్నూలులో, ఇంటర్‌ను కృష్ణా జిల్లాలో చదివిన ఓ విద్యార్థినికి మెడికల్ అడ్మిషన్ నిమిత్తం అలంపూర్‌లో 18 ఏళ్లుగా నివాసం ఉంటున్నట్లు ధ్రువీకరణ పత్రం జారీ చేయడాన్ని తెలంగాణ హైకోర్టు తప్పుబట్టింది. ధ్రువపత్రం ఇవ్వడానికి కారణాలపై రెండు వారాల్లో వివరణ ఇవ్వాలంటూ అలంపూర్ ఎమ్మార్వోకు ఆదేశాలు జారీ చేస్తూ విచారణను అక్టోబరు 31కి వాయిదా వేసింది. మెడికల్ అడ్మిషన్లకు సంబంధించిన నిబంధనపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం నివాస ధ్రువీకరణపత్రం సమర్పించినా తన వినతిపత్రాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ జోగులాంబ-గద్వాల జిల్లా అలంపూర్‌కు చెందిన సింగోటం వెన్నెల హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం నివాస ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించినా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్ ప్రక్రియలో స్థానిక కోటా కింద కాళోజీ యూనివర్సిటీ పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్ పేర్కొన్నారు. తన వినతిపత్రాన్ని తిరస్కరిస్తూ యూనివర్సిటీ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసి అడ్మిషన్ ఇచ్చేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. యూనివర్శిటీ వాదనలను విన్న ధర్మాసనం ఏపీలో చదివిన విద్యార్థినికి నివాస ధ్రువీకరణ పత్రాన్ని ఏ ప్రాతిపదికన ఇచ్చారో, ఏ ప్రాతిపదికన ధృవీకరణ మంజూరు చేశారో వివరణ ఇవ్వాలంటూ అలంపూర్ ఎమ్మార్వోను ఆదేశించింది. తెలంగాణ స్థానికత కలిగి, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారికి స్థానికత విషయంలో రెవిన్యూ అధికారులు విచారణ తర్వాత ధృవీకరణలు మంజూరు చేయాలని తెలంగాణ హైకోర్టు గత నెలలో ఆదేశించింది.

# పండుగ సీజన్‌లో ద్రవ్యోల్బణం దెబ్బ

ముంబై, అక్టోబరు 8:ఈ నెల 04-06 తేదీల్లో, మూడు రోజుల పాటు చర్చలు జరిపిన తర్వాత, రెపో రేటులో ఎలాంటి మార్పు చేయకూడదని ఖీఃఎ మానిటరీ పాలసీ కమిటీ మీటింగ్‌లో నిర్ణయించారు. ఇదే విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. కీలక రేట్లు పెరగలేదు అనే విషయం పైకి కనిపిస్తున్నా, గరిష్ట స్థాయికి చేరిన వడ్డీ రేట్లను ఆర్‌బీఐ తగ్గించలేదు అన్నదాన్ని ఇక్కడ అర్థం చేసుకోవాలి. ఈ ఎఫెక్ట్ బ్యాంక్ లోన్లు తీసుకున్న వాళ్ల మీద, తీసుకోబోయే వాళ్ల మీద ఉంటుంది. అధిక వడ్డీ రేట్ల కారణంగా, సామాన్య జనం మరికొంత కాలం పాటు అధిక ఇఓఎలు చెల్లిస్తూనే ఉండాలి, రిలీఫ్ దొరలేదు. మరోవైపు, దేశంలో ద్రవ్యోల్బణం ఇప్పట్లో తగ్గుతుందన్న ఆశ కూడా కనిపించడం లేదు. ముఖ్యంగా, ఈ పండుగల సీజన్‌లో ఆహార ద్రవ్యోల్బణం నుంచి ఉపశమనం లభించే అవకాశం లేదు. ఈ నెలలో దసరా ఉంది, 10 రోజుల పాటు నవరాత్రులు జరుగుతాయి. ఆ తర్వాత దీపావళి వస్తుంది. మన దేశంలో అతి పెద్ద పండుగలు ఇవి. ఈ పండుగల సీజన్‌లో పెరిగిన ఆహార ద్రవ్యోల్బణం సామాన్యులను భయపెడుతోంది. ఇంట్లో పిండి వంటలు చేసుకోవాలంటే బడ్జెట్ వేసుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. రిటైల్ ద్రవ్యోల్బణం ఈ ఏడాది జులైలో 15 నెలల గరిష్ఠ స్థాయి 7.44 శాతంలో ఉంది. ఆగస్టులో కాస్త శాంతించి 6.83 శాతానికి తగ్గింది. అయితే, అది ఇప్పటికీ సెంట్రల్ బ్యాంక్ కంఫర్ట్ జోన్ (2%-6%) కంటే ఎక్కువగానే ఉంది. రుతుపవన వర్షాలు దేశవ్యాప్తంగా సమానంగా కురవలేదు. ఉత్తరాదిలో కురిసిన వానను ఊళ్లను ముంచెత్తితే, దక్షిణాదిలో చినుకు రాలడం గగనమైంది. ఈ అసమాన, అనూహ్య వాతావరణ పరిస్థితుల కారణంగా కూరగాయలు, పాలు, పప్పులు, ధాన్యాల వంటి నిత్యావసర వస్తువుల ఉత్పత్తికి బ్రేక్ పడింది. దీనివల్ల ఆహార ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. ఆహార పదార్థాల ధరలు సామాన్యుడి నెత్తి మీదకెక్కి తైతక్కలాడుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24లో నూ




ద్రవ్యోల్బణం తగ్గదని ఆర్‌బీఐ అంచనా వేసింది. వచ్చే ఏడాది మార్చి వరకు ద్రవ్యోల్బణం సగటున 5.40 శాతంగా ఉంటుందని లెక్క కట్టింది. రెండో త్రైమాసికంలో ద్రవ్యోల్బణం రేటు 6.40 శాతంగా, మూడో త్రైమాసికంలో 5.60 శాతంగా, నాలుగో త్రైమాసికంలో 5.20 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికంలో 5.20 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని చెబుతోంది. అంటే, దేశంలో ధరలు ఇప్పట్లో తగ్గే ఛాన్స్ లేదని ఆర్‌బీఐ కూడా అంగీకరించింది. దీనిని బట్టి, ఈ పండుగ సీజన్‌లో సంబరం సామాన్యుడికి మరింత భారంగా మారుతుంది. కరోనా మహమ్మారి తర్వాత, ఆర్థిక వృద్ధిని పరుగులు పెట్టించడానికి రెపో రేటును 4 శాతానికి ఆర్‌బీఐ తగ్గించింది. చాలా కాలం పాటు 4 శాతం వద్దే ఉంచిన కేంద్ర బ్యాంక్, పెరిగిన ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు రెపో రేటును పలుమార్లు పెంచింది. 2022 మే నుంచి రెపో రేటు పెరగడం ప్రారంభమైంది, 2023 ఫిబ్రవరి వరకు ఈ సైకిల్ కొనసాగింది. ఈ కాలంలో రెపో రేటు 250 బేసిస్ పాయింట్లు లేదా 2.50 శాతం పెరిగింది.

# గ్రీన్ హైడ్రోజన్ దిశగా సింగరేణి



కరీంనగర్, అక్టోబరు 8: దేశంలో సోలార్ విద్యుత్తు రంగంలోకి అడుగుపెట్టిన తొలి బొగ్గు కంపెనీగా పేరు తెచ్చుకున్న సింగరేణి కాలరీస్ మరో భారీ పర్యావరణహిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. సింగరేణి నిర్వాహణలో ఉన్న ప్రస్తుత హైడ్రోజన్ ప్లాంటును గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ గా మార్చాలని నిర్ణయించారు. దేశంలో సోలార్ విద్యుత్తు రంగంలోకి అడుగుపెట్టిన తొలి బొగ్గు కంపెనీగా పేరు తెచ్చుకున్న సింగరేణి కాలరీస్ మరో భారీ పర్యావరణహిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. సింగరేణి నిర్వాహణలో ఉన్న ప్రస్తుత హైడ్రోజన్ ప్లాంటును గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ గా మార్చనున్నారు. స్వీయ నిర్వహణలో పెద్దపల్లి జిల్లా రామగుండం రీజియన్‌లో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఇప్పటికే సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్. శ్రీధర్ విద్యుత్ విభాగ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రతి పరిశ్రమ పర్యావరణ స్పృహతో ఉత్పత్తులు సాధించేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే 224 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను పర్యావరణ హితంగా నిర్వహిస్తున్న సింగరేణి, పర్యావరణ హిత హైడ్రోజన్ ను కూడా ఉత్పత్తి చేయాలని ఛైర్మెన్ సూచించారు. 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర వినియోగానికి అవసరమైన హైడ్రోజన్ ను ఇకపై సోలార్ విద్యుత్తు ను వినియోగిస్తూ ఉత్పత్తి చేయాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను ప్రస్తుత ప్లాంటు లో తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అలాగే మరో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని కోరారు.

గ్రీన్ హైడ్రోజన్ వాడే తొలి పవర్ స్టేషన్ సింగరేణి

దేశం లో గ్రీన్ హైడ్రోజన్ వాడే తొలి పవర్ స్టేషన్ కానున్న సింగరేణి సాధారణంగా హైడ్రోజన్ వాయువు ఉత్పత్తిని థర్మల్ విద్యుత్ వినియోగించి ఎలక్ట్రాలసిస్ రసాయనిక పద్ధతి లో ఉత్పత్తి చేస్తుంటారు. ఈ ప్రక్రియలో థర్మల్ విద్యుత్తు కు బదులు సోలార్ విద్యుత్ వినియోగించి ఉత్పత్తి చేసే హైడ్రోజన్ ను 'గ్రీన్ హైడ్రోజన్' గా పేర్కొంటున్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో గల రెండు 600 మెగావాట్ల జనరేటర్ ల లో వేడిమిని తగ్గించడం కోసం శీతలీకరణ ధాతువుగా హైడ్రోజన్ ను వినియోగిస్తున్నారు. దీనికోసం ప్లాంట్ ఆవరణలోనే ఒక హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏడాదికి దాదాపు 10 వేల క్యూబిక్ మీటర్ల హైడ్రోజన్ వాయువును ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి చేసి వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్లాంట్ 100 కిలో వాట్ విద్యుత్తును వినియోగిస్తూ హైడ్రోజన్ వాయువు ను ఉత్పత్తి చేస్తుంది. ఈ నేపథ్యంలో పర్యావరణహిత చర్యగా ప్లాంటును ఇకపై సోలార్ విద్యుత్తు వినియోగం ద్వారా నిర్వహించాలని, తద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తూ, దానిని వినియోగిస్తున్న తొలి థర్మల్ విద్యుత్ కేంద్రంగా దేశంలో నిలవాలని సింగరేణి సంస్థ భావించింది. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర ప్రాంగణంలోనే ప్రస్తుతం 10మెగావాట్ల సోలార్ విద్యుత్ కేంద్రం మరియు 5మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు ఉన్నాయి. అక్కడి నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్తును ప్రస్తుత హైడ్రోజన్ ప్లాంటుకు వినియోగించు కునేందుకు పూర్తి అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పర్యావరణహిత చర్యగా మరో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ను కూడా రామగుండం రీజియన్ లో సింగరేణి సోలార్ ప్లాంట్లు గల ప్రాంతంలో ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించవలసిందిగా ఆదేశాలు జారీచేశారు. గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటును సింగరేణి ఏర్పాటు చేస్తే ఈ హైడ్రోజన్ వాయువును సింగరేణి తో పాటు సమీపంలోని ఎరువుల కర్మాగారాలకు ఇతర కర్మాగారాలు కూడా విక్రయించే అవకాశం ఉంది. లాభాల కన్నా ఒక మంచి పర్యావరణ హిత చర్యగా ఈ ప్రాజెక్ట్ ను చేపట్టాలని కంపెనీ భావిస్తుందని సంస్థ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలల కాలంలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న సోలార్ ప్లాంట్ల ద్వారా 170 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యింది. తద్వారా సింగరేణి సంస్థ తెలంగాణ ట్రాన్స్ కో కు చెల్లించే విద్యుత్ బిల్లులో 108 కోట్ల రూపాయలను ఆదా చేసుకోగలిగిందని సింగరేణి డైరెక్టర్ ఈ అండ్ ఎం, డి.సత్యనారాయణ రావు తెలిపారు...ఇంకా నిర్మాణంలో ఉన్న 76 మెగా వాట్ల సోలార్ ప్లాంట్లను డిసెంబర్ నాటికల్లా పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు

## ఆడపడుచుల కోసం బతుకమ్మ చీరల పంపిణీ

**జెడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, జెడ్పిటిసి**



ఆసిఫాబాద్ జిల్లా అక్టోబర్ 8 (ప్రజాపాలన, ప్రతినిధి) : జిల్లా కేంద్రంలోని బజార్ వాడిలో తెలంగాణ ప్రభుత్వం ఆడపడుచుల కోసం బతుకమ్మ కానుకగా ప్రత్యేకంగా తయారు చేసిన చీరలను జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగిల నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం పథకాలు దేశానికే ఆదర్శంగా గెలుస్తున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్, శ్రీనివాస్, రమేష్, శంకర్, మహిళలు పాల్గొన్నారు.

# అధ్వాన్నంగా కంటోన్మెంట్ రోడ్లు

హైదరాబాద్, అక్టోబరు 8 :సికింద్రాబాద్ లోని ఏఓసి ప్రాంతంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. గుంతలమయమైన రోడ్లతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సికింద్రాబాద్ లోని ఏఓసి ప్రాంతంలో గుంతలమయమైన రోడ్లపై ప్రయాణం చేయలేక వాహణదారులు,స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవతున్నారు. రోడ్లపై లోతు గుంతలు ఉండడంతో అటు వాహనాలు ఇటు ఆరోగ్యం రెండు దెబ్బ తింటున్నాయి అంటున్నారు స్థానికులు. ఇన్ని రోజులు వర్షాకాలం పేరిట రోడ్డు మరమ్మతులు చేయలేదని ఇప్పుడు వర్షాకాలం ముగిసిన తరువాత కూడా రోడ్డు మరమ్మతులు చేయడంలో ఎలాంటి పురోగతి లేదంటున్నారు వాపోతున్నారు. కాగా ఈ ఏఓసి గేట్ల మార్గం నగరంలో కొన్ని కీలక ప్రాంతాలను కలుపుతుంది. ఇలాంటి ప్రధాన



మార్గం ఇంత అధ్వానంగా ఉంటే బోర్డు,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు పట్టించుకోడంలేదో తమకు అర్థం కావడం లేదంటున్నారు.ఏఓసీ రోడ్డుపై డ్రైవింగ్ చేయాలంటే భయంగా ఉందని రోజూ ఈ మార్గంలో వెళ్ళే పి. నందిని చెప్పారు. గుంతలు చాలా లోతుగా ఉన్నాయని, తద్వారా వాహణదారులు , హార్ట్ పేషంట్లు మరియు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఆ రోడ్డు పై వెళ్లాలంటే భయప డుతున్నట్లు చెప్పారు. ఇక రోడ్ల పై దుమ్ము కూడా తీవ్రంగా ఉండటంతో డ్రైవింగ్ కు అంతరాయం కలుగుతుం దన్నారు. ఈ సమస్యలన్నీ పెద్ద ప్రమాదలకు దారి తియ్యకముందే అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని నందిని కోరారు. యాఅ రోడ్ల పై నిత్యం ప్రయాణించే మరో వాహనదారుడు బోజా కార్తికేయ మాట్లాడుతూ? ఇక్కడి రోడ్ల తో వచ్చే అసలు సమస్య కేవలం అసౌకర్యానికి సంబంధించింది కాదని అసలు సమస్య ప్రజల ఆరోగ్య భద్రత ప్రమాధానికి సంబంధించిందన్నారు.అధికారులు స్పందించి తక్షణం మరమ్మతులు పనులు ప్రారంభించాలన్నారు. తమకు తాత్కాలిక పరిష్కారం అవసరం లేదని? శాశ్వత పరిష్కారం కావాలని ఆయన కోరారు. రోడ్డు ప్రమాదకర పరిస్థితుల ఉన్న కారణంగా ఇటీవల ద్విచక్రవాహనదారుడు పడిపోవడంతో తీవ్ర గాయాల పాలయ్యారని మారెడపెల్లికి చెందిన ఆక్టావియో సౌజా తెలిపారు. అనేక మంది క్రీడాకారులు మరియు సైక్లిస్టులు ఈ ప్రాంతానికి తెల్లవారుజామున తరచుగా వస్తుంటారాన్నారు. రోజూ ఈ మార్గాల్లో వెళ్లే వారికి తప్పకుండా మెడ లేదా వెన్నెముక నొప్పులు వస్తాయన్నారు.ాఅః సివిల్-నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ జె. మాట్లాడుతూ? సైనిక అధికారులతో చర్చలు జరిపామన్నారు.ఏఓసి వద్ద రోడ్ల దుస్థితి, అలాగే ఇంట్రెంచ్‌మెంట్ రోడ్డు పరిస్థితిని పరిష్కరించేందుకు త్వరలో కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడితో మాట్లాడుతామని, ఇప్పటికే చాలా నెలల క్రితమే ప్యాచ్‌వర్క్‌లు చేశామని చెప్పారు. అయితే త్వరలో శాశ్వత పరిష్కాంానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## మోడీ , నడ్డా వెళ్లారు... షా వస్తున్నారు

హైదరాబాద్, అక్టోబరు 8 :తెలంగాణలో కాషాయ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కమలనాథులు దూకుడు పెంచుతున్నారు. ఈ నెల మొదటి వారంలో మోడీ రెండు సార్లు తెలంగాణకు రాగా... నడ్డా శుక్రవారం హైదరాబాద్ లో పర్యటించారు. వరుస పర్యటనలతో బీజేపీ క్యాడర్‌లో జోష్ నింపుతున్నారు అగ్రనేతలు. ఈ నెల 10న తెలంగాణకు రానున్న అమిత్ షా.. ఒకే రోజు రెండు సభల్లో పాల్గొనబోతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నగారా మరికొద్ది రోజుల్లో మోగడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో.. బీజేపీ అగ్ర నాయకత్వం స్పీడ్ పెంచుతోంది. వరుస బహిరంగ సభలతో హోరెత్తించేలా వ్యూహాలు రచిస్తోంది. గులాబీ తోటలో కమల వికాసమే లక్ష్యంగా అధికార బీఆర్‌ఎస్‌కు ధీటుగా సభలు, సమావేశాలు నిర్వహించబోతోంది. ఆయా సభలకు బీజేపీ అగ్ర నేతలు హాజరుకానున్నారు. ఇప్పటికే మూడు రోజుల వ్యవధిలో రెండుసార్లు తెలంగాణకు వచ్చిన ప్రధాని మోదీ.. ఎన్నికల వేడిని రాజేసివెళ్లారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా రెండు రోజులుగా హైదరాబాద్‌లో మకాం వేశారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఎన్నికల సమాయత్తంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మరోవైపు.. హైదరాబాద్ బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, ఇంఛార్జీల సమావేశం జరగ్గా.. ఎన్నికల వ్యూహాలపై ప్రధానంగా చర్చించారు. ఎన్నికల రూట్ మ్యాప్ ఖరారుపై నేతలకు పార్టీ సంస్థాగత జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్, సునీల్ బన్సల్ దిశానిర్దేశం చేశారు. ఇదే సమయంలో.. ఈ నెల 10న తెలంగాణకు రాబోతున్నారు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా. ఈ సందర్భంగా.. ఒకే రోజు రెండు బహిరంగ సభలు నిర్వహించాలని బీజేపీ నేతలు నిర్ణయించారు. 10న ఉదయం ఆదిలాబాద్ జిల్లాలో అమిత్‌షా సభ నిర్వహించనుండగా.. సాయంత్రం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భారీ సభకు ప్లాన్ చేస్తున్నారు. బండ్లగూడ పరిధిలో బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు తెలంగాణ బీజేపీ నేతలు. మొత్తంగా.. అధికారమే లక్ష్యంగా తెలంగాణలో.. బీజేపీ జాతీయ నాయకత్వం దండయాత్రకు సిద్ధం కావడంతోపాటు.. అగ్ర నేతల పర్యటనలతో బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంటోంది.

# మహిళలే మహారాణులు



మెదక్, అక్టోబరు 8 :సిద్ధిపేట జిల్లాలో మొత్తం 9,25,398 మంది ఓటర్లు ఉండగా, అందులో మహిళల ఓట్లు 4,68,140 ఉన్నాయి.పురుషుల ఓట్లు 4,57,178 మాత్రమే ఉన్నాయి. సిద్ధిపేట జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లదే ఆధిపత్యం ఉంది.సిద్ధిపేట నియోజకవర్గంలో మొత్తం 2,28,523 ఓట్లు ఉండగా, వారిలో పురుషుల ఓట్లు 1,12, 938 ఉంటే మహిళా ఓటర్లు 1,15,520.. ఇతరులు 69 మంది , ప్రవాస ఓటర్లు ఐదుగురు, సర్వీస్ ఓటర్లు 107 మంది ఉన్నారు.దుబ్బాక నియోజకవర్గంలో మొత్తం 1,94,664 ఓటర్లు ఉన్నారు.వారిలో పురుష ఓటర్లు 95,305 ,మహిళా ఓటర్లు 99,359 , ప్రవాస ఓటర్లు మూడు, సర్వీస్ ఓటర్లు 57 మంది ఉన్నారు.గజ్వేల్ నియోజకవర్గంలో మొత్తం, 2,65, 636 ఓటర్లు ఉన్నారు. వారిలో, పురుషులు 1,31,774 , మహిళలు 1, 33, 855 ఉండగా, ప్రవాసులు ఇద్దరు, సర్వీస్ ఓటర్లు 72 మంది ఉన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,36, 575 ఓటర్లు ఉండగా, పురుషులు 1, 17,165, మహిళలు 1,19, 406, ఇతరులు నలుగురు, ప్రవాసులు 9, సర్వీస్ ఓటర్లు 214 మంది ఉన్నారు.

మెదక్ జిల్లాలో...

మెదక్ జిల్లాలో మొత్తం 4,34,275 మంది ఓటర్లు ఉన్నారు . అందులో పురుషులు 2,09, 927, మహిళలు 2,24, 337, ఇతరులు 11, ప్రవాసులు 9, సర్వీస్ ఓటర్లు 124 మంది ఉన్నారు. మెదక్ నియోజకవర్గంలో మొత్తం 2, 14,064 ఓటర్లు ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 1,02,340, మహిళా ఓటర్లు 1,11, 720, ఇతరులు 4 ఉన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 2,20,211 ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,07, 584, మహిళలు 1,12,617, ఇతరులు 11మంది ఉన్నారు.సంగారెడ్డి జిల్లాలో పురుష ఓటర్లే అధికం... సంగారెడ్డి జిల్లాలో మొత్తం 13,55, 958 ఓటర్లు ఉన్నారు.అందులో పురుషులు 6,83,076, మహిళలు 6,72,757,ఇతరులు 74,సర్వీసు ఓటర్లు 354మంది ఉన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో మొత్తం 2,27,232మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1,14,570 ,మహిళలు 1,12,654, ఇతరులు 8 సర్వీసు ఓటర్లు 67మంది ఉన్నారు.అందోల్ నియోజక వర్గంలో మొత్తం 2,44,710మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1,20,572,మహిళలు 1,24,133 ఇతరులు 5, ప్రవాసులు 5,సర్వీసు ఓటర్లు 48మంది ఉన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,64,732 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 1,33, 312, మహిళా ఓటర్లు 1,31,419 , ప్రవాసులు 3, సర్వీస్ ఓటర్లు 103 మంది ఉన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో మొత్తం 2,38, 336 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,18,265 , మహిళా ఓటర్లు 1,20,037 , ఇతరులు 34, ప్రవాసులు 10, సర్వీస్ ఓటర్లు 66 మంది ఉన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో మొత్తం 3,80,948 మంది ఓటర్లు ఉన్నారు, అందులో పురుషులు 1,96, 357, మహిళలు 1,84, 504 , ఇతరులు 77, ప్రవాసులు 56, సర్వీస్ ఓటర్లు 70 మంది ఉన్నారు..

## డివిలియర్స్ రికార్డు బద్దలు.. 29 బంతుల్లోనే సెంచరీ

ఢిల్లీ: ప్రపంచకప్‌లో అత్యధిక పరుగుల రికార్డు బద్దలై ఒక్క రోజు కూడా కాకముందే.. లిస్ట్-'ఏ' క్రికెట్‌లో పెను విధ్వంసం నమోదైంది. దక్షిణాఫ్రికా దేశవాళీ టోర్నీ 'ది మార్ష్ కప్'లో భాగంగా 21 ఏండ్ల కుర్రాడు ఫ్రెజర్ మెక్‌గుర్క్ అరుదైన రికార్డు నమోదు చేసుకున్నాడు. కేవలం 29 బంతుల్లోనే సెంచరీ చేసి లిస్ట్-'ఏ' క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ తన పేరిట లిఖించుకున్నాడు. దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు ఏబీ డివిలియర్స్ పేరిట ఉన్న రికార్డును ఫ్రెజర్ తిరగరాశాడు. అయితే డివిలియర్స్ అంతర్జాతీయ స్థాయిలో వెస్టిండీస్‌పై (2015లో) 31 బంతుల్లో సెంచరీ చేసిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ పోటీల్లో ఇదే ఫాస్టెస్ట్ కాగా.. లిస్ట్-'ఏ'లో ఫ్రెజర్ నయా రికార్డు నెలకొల్పాడు. టాస్మానియాతో జరిగిన పోరులో సౌత్ ఆస్ట్రేలియా తరఫున బరిలోకి దిగిన ఫ్రెజర్.. తొలుత 18 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత మరింత చెలరేగిన ఈ కుర్రాడు.. మరో 11 బంతుల్లోనే మూడంకెల స్కోరు తన పేరిట లిఖించుకున్నాడు. చివరికి అతడు 38 బంతుల్లో 125 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే తొలుత బ్యాటింగ్ చేసిన టాస్మానియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 435 పరుగులు చేసింది. జోర్డాన్ స్కిల్ (116) సెంచరీతో చెలరేగగా.. జెవెల్ (90), రైట్ (51) హాఫ్ సెంచరీలు చేశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఫ్రెజర్ (38 బంతుల్లో 125బీ 10 ఫోర్లు, 13 సిక్సర్లు) దంచికొట్టినా.. దక్షిణ ఆస్ట్రేలియా చివరకు 46.4 ఓవర్లలో 398 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా టాస్మానియా 37 పరుగుల తేడాతో విజయం సాధించింది.

# రెబల్స్ తగ్గనుంటున్నారే...

హైదరాబాద్, అక్టోబరు 8 :అందరికంటే ముందే అభ్యర్థుల లిస్ట్ ప్రకటించి అసెంబ్లీ ఎన్నికల సమరశంఖం పూరించింది బీఆర్ఎస్. ఈ క్రమంలోనే ఉమ్మడి మెదక్ జిల్లాలో సిట్టింగ్‌లందరికీ సీట్లు దక్కాయి. పార్టీ ప్రాతినిధ్యం లేని సంగారెడ్డి నుంచి మాజీ ఎమ్మెల్యే, యాఉఆఅ చైర్మన్ చింతా ప్రభాకర్‌కు అవకాశం దక్కింది. అయితే ఈ సారి సిట్టింగ్ సీట్లలో అసమ్మతి పెల్లుబుకుతోంది. కొన్ని చోట్ల అభ్యర్థులు మారుస్తారని ఊహాగానాలు వచ్చినా అది జరగకపోవడంతో తీవ్ర అసహనంతో ఉన్నారట ఆశావహులు. ఒక్క అందోల్ తప్ప మిగతా అన్ని చోట్ల అసమ్మతి, అసంతృప్తి బయటపడుతూనే ఉన్నాయి. లిస్ట్ వచ్చేదాకా పార్టీకి విధేయులుగా ఉన్న నేతలు ఇక టిక్కెట్స్ రావని తేలిపోయాక ఒక్కసారిగా స్వరం పెంచారట. పటాన్ చెరులో మహిపాల్ రెడ్డికే తిరిగి ఇవ్వడంతో టికెట్ ఆశించిన నీలం మధు రెబెల్‌గా పోటీ చేయాలనుకుంటున్నట్టు తెలిసింది. ఇప్పటికే నియోజకవర్గంలో ఆయన అనుచరులు, కార్యకర్తలు రోజూ ఆందోళనలు చేస్తూనే ఉన్నారట. నీలం మధుకే టికెట్ ఇవ్వాలంటూ పటాన్ చెరు నుంచి బీరంగూడలో




ఉన్న మల్లన్న ఆలయం వరకు ర్యాలీ తీశారు. కేటీఆర్‌కి సన్నిహితుడినంటూ.. ప్రచారం చేసుకుని, కచ్చితంగా టిక్కెట్ వస్తుందని ఆశించారు మధు. ఇక సంగారెడ్డి లోనూ అదే పరిస్థితి ఉందట. ఃఖీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ టికెట్ రావడంతో అప్పటివరకు ఆశించిన నేతల్లో పులి మామిడి రాజు బీజేపీలో చేరగా ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం మాత్రం పార్టీలోనే ఉంటూ అసమ్మతి పాట పాడుతున్నారు. జహీరాబాద్ లో సిట్టింగ్ ఎమ్మెల్యే మాణిక్ రావుపై తీవ్ర వ్యతిరేకత ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. కార్యకర్తల్ని పట్టించుకోడని గుర్రుగా ఉంది క్యాడర్. అయినా ఆయనకే టికెట్ ఇవ్వడంతో సొంత పార్టీ నాయకులే నిరసన స్వరం వినిపిస్తున్నారు.మరో వైపు ఈ ఎన్నికల్లో టికెట్ ఆశించి పార్టీలో చేరిన ఏర్పుల నరోత్తంకి ఎస్సి కమిషన్ చైర్మన్ ఇచ్చి బుజ్జగించగా?మరో నేత ఢిల్లీ వసంత్ తన ఆవేదనని భజన రూపంలో వినిపించారట. మూడు రోజుల పాటు భజన కార్యక్రమాలు నిర్వహించి ఎమ్మెల్యే అభ్యర్థి మార్పుపై పునరాలోచించాలని కోరారట. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఒంటెద్దు పోకడలను భరించలేకపోతున్నామని అంటున్నారు ద్వితీయ శ్రేణి నేతలు. ఈ సారి ఎన్నికల్లో ఆయనకు బుద్ధి చెప్పాలంటూ కాంగ్రెస్ నేతలకు సీక్రెట్ గా సపోర్ట్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇలా ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అసమ్మతులు స్వరం పెంచుతున్నారు. అధినాయకత్వం దీన్ని ఎలా డీల్ చేస్తుందో చూడాలి.

## 'అట్టడుగు వర్గాల అభివృద్ధికి పాశ్వాన్ కృషి ఏనలేనిది'

### ఆర్ఎల్జేపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇనుగాల భీమారావు



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: అట్టడుగు వర్గాల అభివృద్ధికి లోక్ జనశక్తి పార్టీ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ రామ్ విలాస్ పాశ్వాన్ చేసిన కృషి ఏనలేనిదని రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇనుగాల భీమారావు అన్నారు. పాశ్వాన్ వర్ధంతిని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో పాశ్వాన్ ప్రధాన పాత్ర పోషించారని కొనియాడారు.




రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధం

త్వరలోనే సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 27 నియోజకవర్గ స్థానాల్లో పోటీకి అభ్యర్థనలు వచ్చాయన్నారు. కేంద్రంలో బీజేపీతో పొత్తులో ఉన్న తమ పార్టీ త్వరలోనే తెలంగాణలో సీట్ల విషయంపై చర్చిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత రెండు ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ ను నియమింపక, ఇటీవల కంటితుడుపు చార్యగా నియించడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పెండ్యాల నర్సింహారావు, అభిరామ్, మేడిశెట్టి వెంకటేశ్వర్ రావు, మేకల విజయలక్ష్మి, భానుమూర్తి, కృపా ప్రసాద్ , బోయిని శ్రీనివాస్, ఆంథోని, మల్లేష్, గొర్రె బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దివంగత రామ్ విలాస్ పాశ్వాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# అక్టోబర్ 9న ఛలో హైదరాబాద్



ఇబ్రహీంపట్నం అక్టోబర్ తేదీ 8 ప్రజా పాలన ప్రతినిధి: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఇబ్రహీంపట్నం టౌన్ మున్సిపాలిటీ లో ఛలో హైదరాబాద్ కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈసందర్భంగా ఎన్ పి ఆర్ డి జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో 21 రకాల వైకల్యాల ప్రకారం సుమారు 43.04 లక్షల మంది వికలాంగులు ఉన్నారని వీరిలో 5.16లక్షల మందికే పెన్షన్లు వస్తున్నాయని అన్నారు. వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 2016లో పేర్కొన్న అంశాలను అమలు చేయాలి. 2016 %ాణ% చట్టం సెక్షన్ 79 ప్రకారం వికలాంగుల కమిషన్ ఏర్పాటు చేసి, ఛైర్మెన్, సభ్యులను నియమించాలి. ధరల పెరుగుదలకు అనుగుణంగా ప్రస్తుతం ఇస్తున్న 4016 నుండి 10,000లకు పెన్షన్ పెంచాలి. పెండింగ్ లో ఉన్నఆసరా పెన్షన్లు మంజూరు చేయాలి. ఆసరా పెన్షన్లకు ఆదాయపరిమితి విధించే జీవో నెంబర్ 17 రద్దు చేయాలి. నామినేటెడ్ పదవుల్లో వికలాంగులకు రిజర్వేషన్స్ కల్పిస్తూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలి. రాజస్థాన్ రాష్ట్రంలో మాదిరిగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్స్ అమలు చేయాలి. ప్రతి వికలాంగుల కుటుంబనికి 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలి. వైకల్య ధ్రువీకరణ పత్రం కలిగిన వికలాంగులకు ఆర్టీసీ మరియు రైల్వేలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి. 40 శాతం వైకల్యం కలిగిన వారందరికీ బస్పాసులు ఇవ్వాలి. ఉద్యోగ నియామకల్లో శారీరక వికలాంగుల రోస్టర్ 10లోపు తగ్గించాలి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలి. వికలాంగుల సంక్షేమం, సాధికారత కోసం వికలాంగుల బంధు పథకం ప్రవేశపెట్టాలి. దళిత బంధు పథకంలో వికలాంగులకు ఐదు శాతం కేటాయించాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల్లో ఐదు శాతం వికలాంగుల కేటాయించాలి. 2016 చట్టం పేర్కొన్న విధంగా సాధారణ లబ్ధిలో 25% అదనంగా వికలాంగులకు అన్ని ప్రభుత్వ పథకాలలో చెల్లించాలి. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, గృహలక్ష్మి పథకంలో ఐదు శాతం కేటాయించాలి. వివాహం కాని వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రత్యేక టీచర్లను నియమించాలి. బదిరులు, అంధులు, శారీరక వికలాంగుల కోసం గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి. విద్యా ఉపాధి కోసం ప్రత్యేక పాలసీ ప్రకటించాలి. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆటిజం , వినికిడి పరీక్షలు, మానసిక వైకల్యం కలిగిన పిల్లల కోసం ప్రత్యేక థెరపీ కేంద్రాలను ఏర్పాటు చేయాలి .ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆడియాల జిస్టులను నియమించాలి. తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులకు 25 వేల ప్రత్యేక చెల్లించాలి. వికలాంగులకు హెల్త్ కార్డ్స్ ఇవ్వాలి . తల సేమియా, సికిల్ సెల్, హీమోఫిలియా వ్యాధి కలిగిన వారికి ఉచితంగా రక్తం సరఫరా చేయాలి. వికలాంగుల వివాహ ప్రోత్సాహకం 2.50 లక్షలకు పెంచాలి. ఇద్దరు వికలాంగులు వివాహం చేసుకుంటే 5 లక్షల రూపాయల ప్రోత్సాహకం ఇవ్వాలి. వికలాంగుల్లోని క్రీడాకారులను గుర్తించి వసతితో కూడిన శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వికలాంగుల క్రీడల కోసం 500 కోట్లు కేటాయించాలి. వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 2016ను పటిష్టంగా అమలు చేయాలి. మానసిక వికలాంగుల కోసం ప్రభుత్వమే ప్రతి జిల్లా కేంద్రంలో మానసిక వికలాంగుల పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలి. నైపుణ్యం కలిగిన వికలాంగులకు జిల్లా కేంద్రాల్లో వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి. ప్రతి నియోకవర్గస్థాయిలో వికలాంగుల కోసం స్పెషల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ్య కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్ ఇబ్రహీంపట్నం టౌన్ అధ్యక్షురాలు తాళ్ల నిర్మల టౌన్ నాయకులు రహిమ్ బాయ్ షాబిర్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీనివాస్ యాదవ్ ను కలిసిన బండారి లక్ష్మారెడ్డి



మేడిపల్లి, అక్టోబర్ 8 (ప్రజాపాలన ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక,మత్స్య మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా హబ్సిగూడ డివిజన్ పరిధిలోని క్యాంప్ 3,4,5 లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రికి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, హబ్సిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు డాక్టర్ బి.వి.చారి,ప్రధాన కార్యదర్శి సామి రెడ్డి, గ్యార ఉపేందర్, లక్ష్మి నారాయణ, మనోహర్, శంకర్, బాల నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## మాటూరు సర్పంచ్ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరల పంపిణీ



మధిర రూరల్ అక్టోబర్ 7 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో మాటూరు గ్రామంలో సర్పంచ్ మేడిశెట్టి లీలావతి,ఎంపీటీసీ అడపాల వెంకటేశ్వర్లు చేతుల మీదగా బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా సర్పంచ్ మేడిశెట్టి లీలావతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తూ దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధిలో దూసుకుని వెళ్తుందని రానున్న రోజుల్లో తెలంగాణలో హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కెసిఆర్ ప్రభుత్వం ఏర్పడుతుందని రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమాలు తీసుకొని వస్తారని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు చీళ్ళ రాములు, షేక్ బాజీ గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొనడం జరిగింది .

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి :తాండూర్ నియోజకవర్గం లో 54 కోట్ల 72లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవం చేయడానికి ఈనెల తొమ్మిదవ తేదీన రాష్ట్ర సమాచార భూగర్భ గనుల శాఖామంత్రి డాక్టర్ బి పట్నం మహేందర్ రెడ్డి తాండూర్ శాసనసభ్యులు పంచాంగ రోహిత్ రెడ్డి తాండూర్ నియోజకవర్గంలోని పెద్దేముల , యాలాల బషీరాబాద్ మండలాలలోపర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

## గ్రామీణ రహదారులకు నిధుల వరద




ప్రజా పాలన ప్రతినిధి కొందుర్గు: ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మరోమారు పల్లెల అభివృద్ధిపై తన ప్రేమను చాటుకున్నారు. మారుమూల పల్లెల రోడ్ల అభివృద్ధి కోసం నిధుల వరుద ను పారుస్తున్నారు. తాజాగా పంచాయతీరాజ్ శాఖ నుండి రూ. 46.22 కోట్ల నిధుల ను మంజూరు మంజూరు చేయించి నియోజకవర్గంలోని 18 గ్రామాలకు సంబంధించిన సుమారు 34 కిలోమీటర్ల మేర ఉన్న దారులను బి.టీ పనులతో ఆధునీకరించనున్నారు. ఫరూఖ్ నగర్ మండలం చిన్నచిలక మర్రి నుంచి కమ్మదనం వరకు రూ. 2.42 కోట్లు, కొండన్నగూడ నుంచి %అఫ్షెశీ% పరిశ్రమ రోడ్డు వరకు రూ.2.3 కోట్లు, చించోడు నుంచి వెంకటరెడ్డి పల్లి వరకు రూ. 2.95 కోట్లు, ఆర్ అండ్ బి రోడ్డు నుంచి ఎల్లంపల్లి వరకు రూ.2.4 కోట్లు, ఎలికట్ట రోడ్డు నుంచి కిషన్ నగర్ వరకు రూ. 2.35 కోట్లు, ఆర్ అండ్ బి రోడ్డు నుంచి పీర్లగూడం వరకు రూ. 2.25 కోట్ల నిధులు రోడ్లను బాగు చేసేందుకు విడుదలయ్యాయి. కేశంపేట మండలంలోని నిర్దవెల్లి నుంచి లింగందన్న వరకు రూ. 5.30 కోట్లు, ఇప్పలపల్లి నుంచి శేరిగూడ వరకు రూ.2.44 కోట్లు, సుందరాపురం నుంచి లే మామిడి రోడ్డు వరకు రూ. 2.13 కోట్లు, జడ్పీ రోడ్డు నుంచి అవజ్ మియా పపడకల్ వరకు రూ. 1 కోట్లు, వేముల నర్వ ఎస్సీ కాలనీ మీదుగా చౌదరి గూడెం వరకు రూ.1.49 కోట్ల నిధులను బీటి రోడ్ల కోసం వెచ్చిస్తున్నారు. కొందుర్గు, చౌదరిగూడ మండలాలలో రేగడి చిలకమర్రి నుంచి కంకల్ వరకు రూ. 2.8 కోట్లు, పర్వతాపూర్ నుంచి నవపేట్ బీటీ రోడ్డు వరకు రూ. 2.22 కోట్లు, పెద్ద ఎల్కిచర్ల బీటి రోడ్డు నుంచి మముజాయితీపూర్ వరకు రూ. 3. 85 కోట్లు, బీటీ రోడ్డు నుంచి చింతకుంట తండా వరకు రూ.1.2 కోట్లు, రేగడి చిలుక మర్రి నుంచి చింతలపల్లి వరకు రూ 1.80 కోట్ల నిధులతో రోడ్లను బీటి రోడ్లుగా ఆధునీకరించనున్నారు. గ్రామీణ ప్రాంతాలలో రోడ్డు రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో గ్రామీణ ప్రాంతాల రోడ్లకు అధిక నిధులను కేటాయిస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారు తెలిపారు. ఏ ప్రాంతంలో అయితే రోడ్లు బాగుంటాయో, రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉంటుందో ఆ ప్రాంతాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతాయని చెప్పారు. పట్టణ ప్రాంతాలకు దీటుగా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థను అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో గ్రామీణ ప్రాంత బీ.టీ రోడ్లకు అధిక నిధులను కేటాయిస్తున్నామని చెప్పారు.

## నైపుణ్యం కలిగిన భాగస్వాములను సత్కరించిన డ్యూరోప్లై




మేడిపల్లి, అక్టోబర్ 8 (ప్రజాపాలన ప్రతినిధి): భారతదేశ ప్రీమియం, అత్యంత అనుభవం కలిగిన ప్లైవుడ్ తయారీ సంస్థ, ప్రముఖ సంస్థలలో ఒకటైన డ్యూరోప్లై ఇటీవల హైదరాబాద్ లో నిర్వహించిన 'డ్యూరో లెజెండ్' కార్యక్రమంలో దక్షిణ భారతదేశానికి చెందిన నైపుణ్యం కలిగిన భాగస్వాములను సత్కరించింది. డ్యూరోప్లైకి చెందిన ఈ లెజెండ్ స్కిల్ పార్టనర్లలో చాలా మంది తరతరాలుగా కంపెనీతో ఉన్నారు. ప్లైవుడ్, బ్లాక్‌బోర్డులు, డోర్ల ప్రీమియం శ్రేణికి డ్యూరోప్లై ఎంతో మన్నన పొందింది. ఇది ఇప్పటికే ఉత్తర భారతదేశంలో ప్రముఖ సంస్థగా ఉంది. దక్షిణ, తూర్పు, పశ్చిమ భారతదేశంలో కంపెనీ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ సందర్భంగా డ్యూరోప్లై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అఖిలేష్ చిట్లాంగియా మాట్లాడుతూ "డ్యూరోప్లై ఒక బ్రాండ్‌గా ప్రీమియం నాణ్యతకు పర్యాయపదంగా మారిందని తెలిపారు. డ్యూరోప్లై మేం పెనవేసు కున్న వినూత్నతల సంస్కృతి మా పూర్తి దృష్టిని కొనుగోలుదారులకు ఉత్తమ ఉత్పాదనలను అందజేసేందుకు వీలు కల్పిస్తుందని అన్నారు. నిబద్ధత కలిగిన నైపుణ్యవంత భాగస్వాములతో కొన్ని తరాలకు పైగా భాగస్వామ్యం కలిగి ఉన్నందుకు మేం అదృష్టవంతులం వారి అభిరుచి డ్యూరోప్లై తత్వానికి అనుగుణంగా ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమం వినూత్నతను పెంపొందించడానికి, పరిశ్రమ సంబంధాలను పెంపొందించడానికి మా అంకిత భావాన్ని నొక్కి చెబుతుంది" అని అన్నారు. డ్యూరో లెజెండ్స్ వారి విధేయత, ప్రయత్నాలు, కృషికి ప్రతిఫలం పొందారు. లెజెండ్ స్కిల్డ్ భాగస్వాములు కూడా ఈ గుర్తింపు పొందినందుకు తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలోని ఇళ్లలో డ్యూరో ప్లై ప్రీమియం ప్లైవుడ్‌ను విస్తృతంగా స్వీకరించే దిశగా తమ ప్రయత్నాలను పునరుద్ధరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. డ్యూరోప్లై కాలపరీక్షకు నిలబడే అత్యుత్తమ-నాణ్యత ఉత్పత్తులను అందించే తన ఆశయానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సంస్థ నిరంతర వృద్ధి, విజయం శ్రేష్ఠత, కస్టమర్ సంతృప్తి పట్ల దాని అచంచలమైన అంకిత భావా నికి నిదర్శనం. ఇటువంటి ధోరణి పరిశ్రమకు ఓ మంచి సంకేతం, వాటాదారులందరికీ ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు.

## చిన్నారిని ఆశీర్వదించిన సర్పంచ్ మారెళ్ళ మమత దంపతులు..



తల్లాడ, అక్టోబర్ 8 (ప్రజాపాలన న్యూస్): తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన పాస్టర్ గడేసుల ఆనందరావు మనవరాలు వసంతరావు పద్మ దంపతుల కుమార్తె అనన్య ఓణీల అలంకరణ వేడుక ఆదివారం గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అన్నారు గూడెం గ్రామ సర్పంచ్ మారెళ్ళ మమత గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ మారెళ్ళ మల్లికార్జున్ రావు దంపతులు హాజరై ఆ చిన్నారికి అక్షింతలు వేసి దీవించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మాజీ ఎంపీటీసీలు తుమ్మలపల్లి సత్యవతి, తాళ్ళ జోసెఫ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నం కృష్ణయ్య, దొడ్డ వెంకటయ్య, తాళ్ళ అగ స్టీన్, తదితరులు ఉన్నారు.

## జీ ఓ 118 ను అమలు చేసి ఆదుకోండి

సాయి ప్రియ వెల్ఫేర్ అసోసియేషన్




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి): పీర్జాదిగూడ మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన స్థలాల వివాదంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జారీచేసిన జీవో 118 ను అమలు చేసి తమను ఆదుకోవాలని సాయి ప్రియ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ నాయకులు మహేందర్, నారగోని ప్రవీణ్ లు మాట్లాడారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా, మేడిపల్లి మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన సర్వే నెంబర్లు 5 నుంచి 9 వరకు గల స్థలాన్ని తాము 1995 నుంచి 2002 సుమారు 350 మందిమి కొనుగోలు చేశామని చెప్పారు. ఈ నేపథ్యంలో మంత్రి కేటీఆర్ హామీతో 118 జిఒ వచ్చిందని అన్నారు. అత్యున్నత అధికారులు బాధితులకు న్యాయం చేయమని ఆదేశాలు జారీ చేసినా జిల్లా కలెక్టర్ అది అమలు చేయకుండా తమను వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ జోక్యం చేసుకొని తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నర్సింహా రెడ్డి, న్యాయ సలహాదారుడు హరి ప్రసాద్‌లతోపాటువందమందిబాధితులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ 6 ఆరు పథకాలు తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్షడా.కోట రాంబాబు

మధిర రూరల్ అక్టోబర్ 7 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలోవంగవీడు గ్రామంలో మహిళలకు 6 పథకాల గురించి వివరించిన డా.కోట రాంబాబు కాంగ్రెస్ పార్టీ ఆరు పథకాలు తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోటా రాంబాబు అన్నారు వంగవీడు గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి మహిళలకు ఆరు పథకాల గురించి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఈ ఆరు పథకాలను అమలు చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం వారు ఇచ్చిన ఏ హామీలు నెరవేర్చలేదు అని నాలుగు సంవత్సరాల పది నెలల రోజుల్లో గుర్తురాని ఇల్లు లేని నిరుపేద ప్రజలు ఎన్నికలకు రెండు నెలల ముందు గుర్తు వచ్చి గృహలక్ష్మి అనే కొత్త కొత్త మోసపూరితమైన హామీలను ఇస్తున్నారు. తెలంగాణ ప్రజలు కెసిఆర్ మోసపూరితమైన వాగ్దానాలు మాటలను నమ్మవద్దు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వం అని, ఇచ్చిన ప్రతి హామీని తప్పక నెరవేరుస్తారు అని అన్నారు. హస్తం గుర్తు పైన ఓటు వేసి మధిర నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక ఓట్లు మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర్ రెడ్డి ఐలూరి జనార్దన్ రెడ్డి, ఐలూరి సత్యనారాయణ రెడ్డి , ఓబుల లక్ష్మారెడ్డి , సురేష్ , ప్రసాద్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు




## సర్పంచ్ మునగాల వెంకట్రామ ఆధ్వర్యంలోబతుకమ్మ చీరల పంపిణీ.




మధిర రూరల్ అక్టోబర్ 7 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో మునగాల గ్రామంలోని సర్పంచ్ వెంకట్రామ చేతుల మీదగా బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా సర్పంచ్ వెంకట్రామ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తూ దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధిలో దూసుకుని వెళ్తుందని రానున్న రోజుల్లో తెలంగాణలో హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కెసిఆర్ ప్రభుత్వం ఏర్పడుతుందని రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమాలు తీసుకొని వస్తారని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొనడం జరిగింది

## యుద్ధంలో హీరోయిన్ సేఫ్.. ముంబైలో ల్యాండ్



ఇజ్రాయెల్ యుద్ధంలో బాలీవుడ్ హీరోయిన్ నుస్రత్ భరూచా చిక్కుకుని పోయింది. ఆమె హైఫా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ కు హాజరయ్యేందుకు తన టీమ్ తో కలిసి ఇజ్రాయెల్ వెళ్ళింది. ఫిల్మ్ ఫెస్టివల్ లో పాల్గొని ఆనందించే లోపే.. సడెన్ గా ఇజ్రాయెల్ లో యుద్ధం మొదలు అయింది. దాంతో ఒక్కసారిగా ఇజ్రాయెల్ లో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో సైట్ సీయింగ్ కు వెళ్లిన నుస్రత్ భరూచాకు ఆమె టీమ్ కు కమ్యూనికేషన్ కట్ అయిందని టాక్ నడుస్తుంది,దీంతో, ఒక్కసారిగా ఆందోళన చెందిన నుస్రత్ భరూచా టీమ్.. ఇజ్రాయెల్ లోని భారత రాయబార కార్యాలయాన్ని ఆశ్రయించి.. ఇండియా తిరిగి వెళ్లడానికి తమకు సహాయసహకారాలు అందించాలని కోరింది. వెంటనే ఎంబసీ అధికారులు కూడా చొరవ తీసుకున్నారు. నుస్రత్ భరుచాకు వారు తమ సహాయాన్ని అందించారు. ప్రస్తుతం ఆమె క్షేమంగా ఉంది. నుస్రత్ భరూచాను క్షేమంగా ఇండియా పంపించడం కోసం ఎంబసీ అధికారులు తగిన ఏర్పాట్లు కూడా చేశారు. ఆమె తాజాగా ముంబైలో కూడా ల్యాండ్ అయ్యారు.

## టెలివిజన్ ప్రీమియర్ కి రెడీ అయిన "బ్రో"




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్ ప్రధాన పాత్రల్లో నటించిన మూవీ బ్రో ది అవతార్. ఈ చిత్రం థియేటర్ల లో రిలీజ్ అయ్యి ప్రేక్షకులను, అభిమానులని విశేషం గా ఆకట్టుకుంది. బాక్సాఫీస్ వద్ద డీసెంట్ వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా ఇప్పుడు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా బుల్లితెర ప్రేక్షకులను అలరించడానికి రెడీ అయిపోయింది. ఈ చిత్రం యొక్క శాటిలైట్ హక్కులను ప్రముఖ టీవీ ఛానల్ అయిన జీ తెలుగు సొంతం చేసుకున్న సంగతి అందరికీ తెలిసిందే.అయితే అక్టోబర్ 15, 2023 న సాయంత్రం 6:00 గంటలకి జీ తెలుగు లో ఈ సినిమా ప్రసారం కానుంది. కేతిక శర్మ, ప్రియా ప్రకాష్ వారియర్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి థమన్ సంగీతం అందించారు. ఈ చిత్రం బుల్లితెర పై ఎలాంటి రెస్పాన్స్ ను సొంతం చేసుకుంటుందో చూడాలి.

## బిగ్ బాస్‌లో టైగర్ జోరు.. నాగ్‌తో ఇలా..




మాస్ మహారాజా రవితేజ, నుపూర్ సనన్ జంటగా నటించిన లేటెస్ట్ మూవీ టైగర్ నాగేశ్వరరావు. స్టువర్ట్‌పురం దొంగ టైగర్ నాగేశ్వరరావు జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ నిర్మించారు. ఈ సినిమాపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలే ఉన్నాయి. దసరా కానుకగా అక్టోబర్ 20న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గరపడుతుండటం వల్ల ప్రమోషన్స్‌లో జోరు పెట్టింది మూవీటీమ్. రవితేజ కూడా వరుస ఇంటర్వ్యూలు ఇవ్వడానికి రెడీ అయ్యారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా మూవీటీమ్.. తెలుగు బిగ్గెస్ట్ రియాలిటీ షో బిగ్ బాస్ 7లోనూ సందడి చేయనుంది. ఈ షోకు సంబంధించిన ఫొటోస్ కూడా బయటకు వచ్చాయి. నేడు వీకెండ్ షో కావడం వల్ల సాయంత్రం ప్రసారం కానున్న షోలో రవితేజ అండ్ టీమ్.. నాగార్జునతో కలిసి బిగ్ బాస్ 7 స్టేజ్‌ను షేర్ చేసుకోనున్నారు. ఇప్పటికే షూట్ పూర్తైన ఈ సాలిడ్ ఎపిసోడ్‌లో టైగర్ నాగేశ్వరరావు స్టేజ్?పై ఎనర్జిటిక్ పెర్ఫామెన్స్ కూడా చేశారట. అలాగే షూట్ గ్యాప్‌లో నాగ్‌తో కలిసి కూర్చొని ముచ్చట్లు కూడా బానే పెట్టారని తెలిసింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పిక్స్ నెట్టింట వైరల్‌గా మారాయి. అభిమానుల్ని బాగా ఆకట్టుకుంటున్నాయి. కాగా, వంశీ తెరకెక్కించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. అలాగే సంజ్ఞా భాష( ఇండియన్ సైన్ లాంగ్వేజ్)లోనూ రిలీజ్ కాబోతుండటం విశేషం. ఈ చిత్రానికి జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా.. . ఆర్.మది ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు. జీషూ సేన్ గుప్తా, రేణూ దేశాయ్, అనుపమ్ ఖేర్ తదితరులు సినిమాలో ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాతోనే రవితేజ బాలీవుడ్ అరంగేట్రం చేయనుండటం విశేషం. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల అయిన పోస్టర్స్, టీజర్, ట్రైలర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## ప్రభాస్ - లోకేశ్ కాంబో.. ఇప్పట్లో కష్టమే..




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో లోకేశ్ కనగరాజ్ సినిమా ఉంటుందని గత కొంతకాలంగా సినీ వర్గాల్లో మాటలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఖైదీ, మాస్టర్, విక్రమ్ చిత్రాలతో వరుస విజయాలను అందుకున్న లోకేశ్ కనగరాజ్ .. ప్రస్తుతం లియో చిత్రంతో బిజీగా ఉన్నాడు. తాజాగా ఈ మూవీ ప్రమోషన్స్?లో ప్రభాస్?తో సినిమాపై హింట్ ఇచ్చాడు. అయితే ఈ మాట వినడానికి చాలా బాగుంది కానీ.. కార్యరూపం దాల్చుతుందా అంటే చాలా పెద్ద సమయమే పట్టేట్టు కనిపిస్తోంది. ఎందుకంటే కోలీవుడ్?లోనే కాదు ఇతర భాషల్లోనూ విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న లోకేశ్? కనగరాజ్.. లియో తర్వాత సూపర్ స్టార్ రజనీకాంత్?తో ఓ భారీ సినిమా చేస్తున్నాడు. త్వరలోనే ఇది సెట్స్‌పైకి వెళ్లనుంది. కనీసం ఐదు ఆరు నెలలు రజనీకాంత్ 171 స్క్రిప్ట్ కోసం పని చేసినా.. ఆ తర్వాత షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ ఇతర పనులు పూర్తయ్యేసరికి 2024 చివరి దశ వచ్చేస్తుంది. ఆ తర్వాత ఖైదీ 2, కమల్ హాసన్‌తో విక్రమ్ 2 చేయాలి. ఈ సినిమాలకు సంబంధించిన కథ ఉన్నప్పటికీ.. ఫుల్ వెర్షన్ ఇంకా డెవలప్ చేయాలట. ఇంకా రోలెక్స్ సోలో క్యారెక్టర్‌తో ఓ భారీ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నాడు లోకేశ్. ఇవన్నీ లోకేశ్ యునివర్స్ పేరుతో రానున్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ కంప్లీట్ అవ్వడానికి మరో నాలుగేళ్లు కనీసం పడుతుంది. ఈలోగా ప్రభాస్ లైన్?పై కూడా భారీగానే ఉంది. కల్కి 2, సలార్ 2, మారుతీతో సినిమా, సందీప్ వంగాతో స్పిరిట్ ఇలా పెద్దగానే ఉంది. ఇవన్నీ పూర్తి అవ్వడానికి కూడా చాలా సమయమే పడుతుంది. ఇంకా వీటి తర్వాత హను రాఘవపూడి పేరు కూడా వినిపిస్తోంది. కాబట్టి ఇవన్నీ లెక్కలేసుకుని చూసుకుంటే 2030 వరకు వెళ్లినా ఆశ్చర్యం లేదని చెప్పాలి. ఒకవేళా ఏదైనా అనూహ్య పరిణామం చోటు చేసుకుంటే తప్ప ప్రభాస్ - లోకేశ్ సినిమా మొదలు కావడం అసాధ్యం అని చెప్పాలి. కాబట్టి ఒకటి రెండు సంవత్సరాలలో వీరిద్దరి కాంబో ఉండకపోవచ్చు. చూడాలి మరి ఏం జరుగుతుందో...

## హతవిధి.. పాట కూడా కాటేసింది..?



యువ హీరో కిరణ్ అబ్బవరం కి బ్యాడ్ టైం నడుస్తుంది. లాస్ట్ ఇయర్ వినరో భాగ్యము విష్ణు కథ హిట్ అవగా ఆ తర్వాత వరుస సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయి. రీసెంట్ గా వచ్చిన రూల్స్ రంజన్ మీద చాలా హోప్స్ పెట్టుకున్న కిరణ్ అబ్బవరం కి ఈ సినిమా కూడా షాక్ ఇచ్చింది. రత్నం కృష్ణ డైరెక్షన్ లో వచ్చిన ఈ ప్రేక్షకులను మెప్పించడంలో విఫలమైంది. రొటీన్ కథ పరమ రొటీన్ కథనంతో రూల్స్ రంజన్ ఆడియన్స్ పేషెన్సీ ని టెస్ట్ చేస్తుంది. ప్రచార చిత్రాలు సినిమా పై బజ్ పెంచగా సినిమాలోని సమ్మోహనుడా సాంగ్ హిట్ అయ్యింది. రిలీజ్ ముందు సినిమా లోని ఒక సాంగ్ రీల్స్ లో వైరల్ అయితే ఆ సినిమా ఉన్న సినిమాకు ఆ సాంగ్ వల్ల కొంత మైలేజ్ వస్తుంది. కానీ సమ్మోహనుడా సాంగ్ కూడా రూల్స్ రంజన్ ని కాపాడలేకపోయింది. సినిమాలోని ఆ సాంగ్ లో నేహా శెట్టి గ్లామర్ షో అదిరిపోయింది. అయితే సినిమా అంతా పరమ రొటీన్ గా నడుస్తున్న టైం లో కనీసం ఈ సాంగ్ అయినా రిఫ్రెష్మెంట్ ఇస్తుంది అనుకుంటే అది కూడా నీరసం తెప్పించింది. వీడియో సాంగ్ లో ఉన్నవే థియేటర్ లో ఉండటం వల్ల ఏదైతే సూపర్ హిట్ అనిపించిన సాంగ్ కాస్త తుస్సుమన్నది. ఇలా రూల్స్ రంజన్ విషయంలో చాలా మిస్ ఫైర్ అయ్యాయి. కంప్లీట్ ఎంటర్టైనర్ అంటూ వచ్చిన రూల్స్ రంజన్ సినిమా ఆడియన్స్ ని బలవంతంగా నవ్వించే ప్రయత్నం చేయించింది తప్ప కథ కథనాలు వాటికి తగిన ఎంటర్టైనింగ్ అందించలేకపోయింది.

## "టైగర్ 3" ట్రైలర్ పై సల్మాన్ కామెంట్స్..!




బాలీవుడ్ సినిమా దగ్గర నెక్స్ట్ బిగ్గెస్ట్ రిలీజ్ గా వస్తున్నా మోస్ట్ అవైటెడ్ చిత్రం "టైగర్ 3" కూడా ఒకటి. పైగా ఈ చిత్రం యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మాణం నుంచి స్పై యూనివర్స్ లో భాగంగా ఈ చిత్రం వస్తుండడంతో దీనిపై గట్టి హైప్ కూడా ఉంది. ఇక రీసెంట్ గా వచ్చిన టీజర్ సాలిడ్ రెస్పాన్స్ అందుకోగా నెక్స్ట్ అయితే మేకర్స్ అవైటెడ్ ట్రైలర్ ని ఈ అక్టోబర్ 16న విడుదల చేస్తున్నట్టుగా ఫిక్స్ చేశారు.మరి పాన్ ఇండియా వైడ్ గా రాబోతున్న సినిమా ఈ ట్రైలర్ పై హీరో బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ పలు ఆసక్తికర కామెంట్స్ చేసారు. అయితే సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ ఈ సినిమాని ఇండియన్ సినిమా దగ్గర నెవర్ బిఫోర్ గా ఉంటుంది అని అలాగే ఎన్నో ట్విస్ట్ లు అలాగే మలుపులు ఇందులో ఉంటాయని సల్మాన్ తెలిపాడు. అంతే కాకుండా ఈ ట్రైలర్ సహా సినిమా కూడా మీరు ఎవరూ ఊహించని లెవెల్లో ఉంటుందని అలాగే తనకి టైగర్ 3 స్టోరీ లైన్ చాలా ఎగ్జైట్ చేసింది అని ఈ సినిమా డెఫినెట్ గా అంచనాలు అందుకుంటుంది అని సాలిడ్ ప్రామిస్ ని అయితే ఆడియెన్స్ కి సల్మాన్ అందించాడు.




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2/29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989